ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్
STATE VISION

బుధవారం 17-06-2026 పేజీలు : 16

## నేడు 17న డి ఆర్ సి సమావేశం



కడప,జూన్ 16:( విజన్ ఆంధ్ర)ఈనెల 17న బుధవారం కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు ఉ .10 గం.లకు జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత గారి అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం(డి ఆర్ సి) నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు.

### ఎంసీఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్‌లో

# బుల్లెట్ రైలు ప్రాజెక్ట్

### -వరంగల్ ఎయిర్ పోర్టు పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష..

ఎంసీఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ ,వరంగల్ ఎయిర్ పోర్టు పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష..

హాజరైన ఎంపీ వేం నరేందర్ రెడ్డి ,స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, ౧+××ఙ కమిషనర్ శశాంక,రంగా రెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి , ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ ప్రావీణ్య .

హైదరాబాద్ పుణె రైల్వే మార్గం లో వికారాబాద్ అనంతగిరి దగ్గర స్టేషన్ ఏర్పాటు చేయాలి అనంతగిరి నుంచి ఐటీ హబ్ కు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలి.. హైదరాబాద్ టు బెంగళూరు హై స్పీడ్ రైల్వే లైన్ భారత్ ఫ్యూచర్ సిటీ లో స్టేషన్ ఏర్పాటు చేయాలి..

మన్ననూర్ దగ్గర నల్లమల స్టేషన్,
సోమశిల సమీపం లో స్టేషన్ ప్లాన్ చేయాలి..

టూరిజం ప్రాంతాలను దృష్టి లో ఉంచుకొని రైల్వే లైన్ ఉండాలి..

హైదరాబాద్ (శంషాబాద్)బుల్లెట్ ట్రైన్ హబ్ గా పిలవాలి..

లివరంగల్ ఎయిర్ పోర్ట్ డిజైన్ లపైన చర్చించిన ముఖ్యమంత్రి లి వరంగల్ ఎయిర్పోర్ట్ కాకతీయ సామ్రాజ్యం



వారసత్వ సంపద అడుగడుగునా ఉట్టి పడేలా ఉండాలి..

ఎయిర్ పోర్టు ముందు భారీ ఐలాండ్ ఉండాలి..

ఐలాండ్ లో రాణి రుద్రమ విగ్రహం ,రుద్రదేవుడు విగ్రహాలతో పాటు భారీ నంది విగ్రహం ఏర్పాటు చేయాలి..

వరంగల్ ఎయిర్ పోర్ట్ డిజైన్స్ పైన ఢిల్లీ వెళ్లి ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులతో చర్చలు జరపాలి..

### బోధన్‌లోని ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, హోటళ్లలో ఆహార భద్రతా అధికారుల

# తనిఖీలు



14 పేజీలో...

## ప్రజా పాలనలో మహిళలకు ప్రాధాన్యం

కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ తిరుపతి రెడ్డి

15 పేజీలో...

### చిన్న మొత్తాలతో గాలం పెద్ద మొత్తాలకు టోకరా..!

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 16 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): రోజుకు వేల రూపాయల ఆదాయం, కొద్దిరోజుల్లో డబ్బు రెట్టింపు, టాస్క్ పూర్తి చేస్తే భారీ కమిషన్ ట్రేడింగ్ ద్వారా ఖచ్చితమైన లాభాలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు.

ముఖ్యంగా టెలిగ్రామ్ గ్రూపులు, నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫార్ములు, ఫేక్ వెబ్‌సైట్ల ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు.

మోసం ఎలా జరుగుతోంది?

సైబర్ నేరగాళ్లు ముందుగా సోషల్ మీడియా లేదా టెలిగ్రామ్ ద్వారా బాధితులను సంప్రదించి ప్రత్యేక గ్రూపుల్లో చేర్చుకుంటారు. ఆ గ్రూపుల్లో అంతర్జాతీయ కంపెనీలు, ప్రముఖ హోటళ్లు, రిసార్టులు లేదా పెద్ద బ్రాండ్ల ప్రతినిధులమని చెప్పుకుంటూ నమ్మకం కల్పిస్తారు.

13 పేజీలో...

### తాళ్ల గురజాలలో

## 'అరైవ్-అలైవ్' అవగాహన కార్యక్రమం

యువత రోడ్డు భద్రత, మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి: సీపీ అంబర్ కిషోర్ ఝూ

15 పేజీలో...



## ప్రభుత్వానికి రూ.4.29 కోట్ల టోకరా..

రైస్ మిల్లు యజమాని అరెస్ట్

14 పేజీలో...



# భూపాలపల్లి ఎస్ఐని సన్మానించిన పద్మశాలి సంఘం నాయకులు

భూపాలపల్లి జిల్లా జూన్ 16( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ గా ఇటీవల బదిలీ పై వచ్చి విధులను నిర్వహిస్తున్న పవన్ కుమార్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపిక ను అందజేసిన పద్మశాలి సంఘం నాయకులు. ఈ యొక్క కార్యక్రమం లో భూపాలపల్లి పద్మశాలి సంఘం నాయకులు ఎలగొండ రాజేంద్ర ప్రసాద్, అడ్డగట్ల శ్రీధర్, సామల శ్రీనివాస్, క్యాతం వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పెద్ద శంకరంపేట్ ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్ ప్రభాకర్ బాధ్యతల స్వీకారం



పెద్ద శంకరంపేట్, జూన్ 16: విజన్ ఆంధ్ర: పెద్ద శంకరంపేట్ స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో నూతన వైద్యాధికారిగా డాక్టర్ ప్రభాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఆయుర్వేద వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వైద్యశాలకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన చికిత్స, అవసరమైన వైద్య సలహాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# తాడిచర్ల ఓసిపి లో కేంద్ర పర్యావరణ శాఖ అధికారి తనిఖీ



మల్హర్, జూన్ 16 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచర్ల-1 ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనిని కేంద్ర పర్యావరణ, శీతోష్ణస్థితి మార్పుల మంత్రిత్వ శాఖ ప్రాంతీయ అధికారి డాక్టర్ ఎం.టి. కరుప్పాయ్ రెండు రోజుల పాటు క్షుణ్ణంగా పరిశీలించారు. గనిలో పర్యావరణ అనుమతి నిబంధనల అమలు, గాలి, నీటి నాణ్యత, దుమ్ము నియంత్రణ, హరితహారం మరియు వ్యర్థాల నిర్వహణ చర్యలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గని యాజమాన్యం పునరావాస కార్యక్రమాలు, భూసార పరిరక్షణ, సామాజిక బాధ్యత పనుల వివరాలను అధికారికి సమర్పించింది. వివిధ ప్రాంతాలను సందర్శించిన అనంతరం ఆయన తన నివేదికను కేంద్ర మంత్రిత్వ శాఖకు సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ జెన్‌కో జనరల్ మేనేజర్ పి. మోహన్ రావు గారు, ఈఈ సివిల్ తౌఫీల్ అహ్మద్ మరియు గని యాజమాన్యం నుండి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ టి. శ్రీధర్, ప్రాజెక్ట్ హెడ్ ఎ. ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కే ఎస్ ఎన్ మూర్తి, మైన్ మేనేజర్ జి శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ కే సురేష్ బాబు, ఎస్టేట్ ఆఫీసర్ రామచంద్ర మూర్తి, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ రామ్ కుమార్ ఒ అభిషేక్, సర్వే డి.జి.యం ఎమ్ సర్వోత్తమ్ ఒ శేషావతారం, ప్రాజెక్ట్ ఇంజనీర్ కే. కిషన్, హెచ్ ఆర్ డి.జి.యం రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కోసం ఎదురు చూపులు

**- రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలి**

**- సేవాలాల్ సేన రైతు సంఘం డిమాండ్**

టేకులపల్లి జూన్ 16 (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో పలుమార్లు హామీ ఇచ్చారని, ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. రుణమాఫీ కోసం వేలాది మంది రైతులు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతున్నారు. సేవాలాల్ సేన రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణ నాయక్ రైతులతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి చాలా కాలం గడిచినా ఇంకా అనేక మంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని రైతులు పంటల నష్టాలు, పెరుగుతున్న సాగు ఖర్చులు, అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో రుణమాఫీ వారికి ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. రుణమాఫీ హామీ పూర్తిస్థాయిలో అమలు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముట్టడికి కూడా సిద్ధమవుతామని సేవాలాల్ సేన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తేజావత్ వస్రం నాయక్, గుగులోతు బిచ్చ నాయక్, వీరు నాయక్, సురేష్ నాయక్, పెద్ద వశ్య నాయక్, వంశీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 1/70 ప్రాంతాల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**- వ్యాపారుల మాయాజాలం-అధికారులు మౌనం..!**

**- రైతుల భవిష్యత్తుతో చెలగాటం..!1/70 చట్టానికి తూట్లు..!**

**-"ఏజెన్సీలో ఎరువుల దందా.. అధికారుల అండదండలున్నాయా..?"**

**- ఏజెన్సీ ప్రాంతంలో ఫెర్టిలైజర్ దందా..! లైసెన్స్ హోల్డర్ ఒకరు.. నిర్వహణ మరొకరి చేతిలో..!**

**- అధికారుల పర్యవేక్షణ లేదా..? అనుమతుల వ్యాపారమా..?**

**- /70 చట్టం అమలుపై అధికారుల నిర్లక్ష్యమా..? ప్రాంతాల్లో చట్టాల అమలు కేవలం కాగితాలకే పరిమితమా..?**

**- అవగాహన లేని సిబ్బందితో రైతులకు తప్పుడు సూచనలు -- కట్టడి చేయాల్సిన అధికారులే అనుమతులు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు**

టేకులపల్లి, జూన్ 16 ( విజన్ ఆంధ్ర) : 1/70 ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను పరిరక్షించేందుకు అమల్లో ఉన్న చట్టాలను కొందరు వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టేకులపల్లి మండలంలో ఫెర్టిలైజర్ దుకాణాల నిర్వహణలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఒకరి పేరుతో లైసెన్స్ తీసుకొని, మరో వ్యక్తి వ్యాపారం నిర్వహిస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఫెర్టిలైజర్, పురుగుమందుల విక్రయాలకు సంబంధించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వ్యక్తులు మాత్రమే రైతులకు సలహాలు ఇవ్వాలి. అయితే కొన్ని దుకాణాల్లో వ్యవసాయంపై కనీస అవగాహన కూడా లేని సిబ్బందిని నియమించి, రైతులకు మందులు, ఎరువుల వినియోగంపై సూచనలు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, పంటలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1/70 ఏజెన్సీ చట్టం ప్రకారం గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల ప్రయోజనాలను కాపాడాల్సి ఉండగా, కొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు మంజూరవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గిరిజనుల పేర్లను ఉపయోగించి అన్యులు వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖ అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక రైతులు, గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ, లైసెన్స్ పొందిన వ్యక్తి స్వయంగా దుకాణం నిర్వహిస్తున్నాడా లేదా అనే అంశంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఫెర్టిలైజర్ షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది అర్హతలు, విక్రయాల రికార్డులు, లైసెన్స్ నిబంధనల అమలుపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి అక్రమాలపై చర్యలు తీసుకోకపోతే, రైతులు మరియు గిరిజన సంఘాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు. 1/70 ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాల అమలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, వాస్తవ స్థాయిలో కూడా ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

**లైసెన్స్ ఒకరిది.. లాభాలు మరొకరికి..!**

నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందిన వ్యక్తే దుకాణం నిర్వహించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. లైసెన్స్ హోల్డర్లు పేరుకే ఉండి, అసలు వ్యాపారం మరొకరు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఇవ్వాల్సిన చోట, వ్యవసాయంపై అవగాహన లేని సిబ్బంది మందులు, ఎరువులు సూచించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ లేదా..? అనుమతుల వ్యాపారమా..?**

ఇలాంటి అక్రమాలు బహిరంగంగానే సాగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దుకాణాల నిర్వహణ, సిబ్బంది అర్హతలు, విక్రయాల రికార్డులపై క్రమం తప్పకుండా తనిఖీలు జరగాల్సి ఉండగా, అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారుల అండదండలతోనే నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు మంజూరవుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 1/70 ఏజెన్సీ ప్రాంతాల్లో ఫెర్టిలైజర్, పురుగుమందుల దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, గిరిజనుల హక్కులను పరిరక్షించాలని కోరుతున్నారు. లేదంటే రైతులు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.



**1/70 ప్రాంతాల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి: ధరావత్ కృష్ణ**

1/70 ఏజెన్సీ ప్రాంతాల్లో ఫెర్టిలైజర్, పురుగుమందుల దుకాణాల్లో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణ డిమాండ్ చేశారు. గిరిజనుల పేర్లతో లైసెన్సులు తీసుకుని అన్యులు వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని అన్నారు. రైతులకు తప్పుడు సలహాలు ఇచ్చి నష్టాలకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 1/70 చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి గిరిజనుల హక్కులను పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## స్కూల్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి



పెద్ద శంకరంపేట్, జూన్ 16: విజన్ ఆంధ్ర : విద్యార్థుల భద్రతే లక్ష్యంగా స్కూల్ బస్సుల్లో అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులు పాఠశాల యాజమాన్యాలను ఆదేశించారు. ప్రతి బస్సుకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్ ఉండాలని సూచించారు. అనుభవం కలిగిన డ్రైవర్‌తో పాటు అటెండర్‌ను తప్పనిసరిగా నియమించాలని, బస్సులో ప్రథమ చికిత్స పెట్టె, అగ్నిమాపక పరికరం, అత్యవసర నిష్క్రమణ సౌకర్యాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అలాగే విద్యార్థుల భద్రత దృష్ట్యా వేగ పరిమితిని పాటిస్తూ వాహనాలు నడపాలని, సాధ్యమైన చోట్ల సీసీ కెమెరాలు, జీపీఎస్ వంటి భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో తల్లిదండ్రులు కూడా పిల్లలకు బస్సు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని అధికారులు కోరారు. భద్రతా నిబంధనలను ఉల్లంఘించే పాఠశాల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రీ-ప్రైమరీ టీచర్ ఎంపికలో పారదర్శకతపై ప్రశ్నలు..!

- స్థానిక అర్హులను కాదని స్థానికేతరులకు అవకాశం కల్పించారా..?
- మెరిట్, అర్హతలు, స్థానికత ప్రమాణాలపై అనుమానాలు..!
- టేకులపల్లి మండలంలో ఎంపిక ప్రక్రియపై విచారణకు ప్రజల డిమాండ్




టేకులపల్లి, జూన్ 16 : టేకులపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల కోసం ఇటీవల నిర్వహించిన ప్రీ-ప్రైమరీ టీచర్ల (నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ) ఎంపిక ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా అర్హతలు కలిగిన అభ్యర్థులు అందుబాటులో ఉన్నప్పటికీ, స్థానికేతరులకు అవకాశాలు కల్పించినట్లు ప్రచారం జరుగుతుండటంతో ఎంపిక ప్రక్రియపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రీ-ప్రైమరీ టీచర్ పోస్టులకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీతో పాటు ఎన్ టి టి, ఈ సి సి ఈ, "మాంటెస్సోరి, డి పి ఎస్ ఈ, వంటి ప్రత్యేక శిక్షణ అర్హతలు ఉండాలి. అలాగే స్థానికత, మెరిట్, రిజర్వేషన్ వంటి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఎంపికలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే టేకులపల్లిలో జరిగిన ఎంపికల్లో ఈ నిబంధనలు పూర్తిగా అమలయ్యాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికంగా అర్హతలు కలిగిన పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎంపిక కాలేదని, ఇతర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులకు అవకాశం లభించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపికైన వారి అర్హతలు, స్థానికత ఆధారాలు, మెరిట్ జాబితా, ఎంపిక ప్రమాణాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్ల అనుమానాలు మరింత పెరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని, దరఖాస్తుదారుల మెరిట్ జాబితాను ప్రకటించాలని, ఎంపిక కమిటీ అనుసరించిన విధానాన్ని వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే మొత్తం వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు

## కోర్టు విచారణకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు



మందమర్రి, జూన్ 16 (విజన్ ఆంధ్ర) : క్యాతన్ పల్లి మున్సిపాలిటీ చైర్ పర్సన్,వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నేపథ్యంలో జరిగిన ఘర్షణలో నమోదైన కేసులో భాగంగా కోర్టు విచారణకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన చివరికి క్యాతన్ పల్లి చైర్ పర్సన్,వైస్ చైర్ పర్సన్ పొత్తులో భాగంగానే బీఆర్ఎస్ ఉ సీపీఐ పార్టీలు కైవసం చేసుకున్నాయని సీనియర్ నాయకుడు రాజా రమేష్ తెలిపారు. మా నాయకులు చట్టాన్ని గౌరవిస్తూ పనిచేస్తున్నారని, న్యాయస్థానం మీద పూర్తి నమ్మకం ఉందన్నారు.

## రైతులకు అందుబాటులో కంది, మినుములు, పెసర విత్తనాలు : ఏఓ హరికృష్ణ



విజన్ ఆంధ్ర - సిర్గాపూర్, జూన్ 16 సిర్గాపూర్ మండల రైతులకు ఔ=+-255 రకం కంది విత్తనాలతో పాటు మినుములు , పెసర విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ తెలిపారు. నాలుగు కిలోల బస్తాల రూపంలో ఈ విత్తనాలు సిర్గాపూర్ మండల రైతు వేదికలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.విత్తనాలు అవసరమున్న రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో సిర్గాపూర్ మండల రైతు వేదికకు వచ్చి విత్తనాలను పొందాలని సూచించారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన కంది, మినుములు, పెసర విత్తనాలతో సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని ఏఓ హరికృష్ణ కోరారు.

## బిజెపి బలోపేతానికి ప్రతి ఒక కార్యకర్త కృషి చేయాలి

దుద్యాల్, జూన్ 16(విజన్ ఆంధ్ర ):దుద్యాల మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో బిజెపి మండల స్థాయి కార్యక్రమంలో మోదీ 12 సంవత్సరాల పరిపాలన పూర్తయిన సందర్భంగా సాధించిన విజయాలు మరియు దేశ అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దుద్యాల బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మోడీ గారి పేరు మీద ఎల్లమ్మ తల్లి దీవెనలు ఉండాలని మోడీ పేరు మీద పూజలు నిర్వహించడం జరిగింది అలాగే గత 12 సంవత్సరాలుగా మోడీ సాధించిన విజయాలపై చర్చించడం జరిగింది ఈ సందర్భంగా దుద్యాల మండల అధ్యక్షులు నారాయణ గారి ఆధ్వర్యంలో మండల స్థాయి బలోపేతానికి కృషి చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొనడం జరిగింది



# ఆపదలో అండగా.. సేవలో ముందుగా

- మరోసారి మానవత్వాన్ని చాటుకున్న ఉద్యోగుల సంఘం....

కారేపల్లిజూన్ 16 (విజన్ ఆంధ్ర) : సింగరేణి మండలం గుంపెళ్ల గూడెం గ్రామంలో 2017 సంవత్సరం నుంచి నిస్వార్థ సేవా భావంతో ముందుకు సాగుతున్న గుంపెళ్ల గూడెం ఉద్యోగ సంఘం మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకుంది.సమాజంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ,కష్టకాలంలో భరోసానిస్తూ ఈ సంఘం చేస్తున్న సేవలు గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి.వివిధ ప్రభుత్వ,ప్రైవేటు రంగాలకు చెందిన ఉద్యోగులు తమ సంపాదనలో కొంత భాగాన్ని పేదల కోసం వెచ్చించాలని సంకల్పించి ఈ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు.కులాలు,మతాలు,హోదాలకు అతీతంగా మానవత్వమే ప్రధాన ధ్యేయంగా ఏర్పడిన ఈ సంఘంలో ప్రస్తుతం ఆరుగురు ఉపాధ్యాయులు,ఒక ఏఓ,ఐదుగురు పోలీసు శాఖ ఉద్యోగులు,ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు, ఐదుగురు భారత సైనికులు,ఇద్దరు పారామిలటరీ సిబ్బంది,ఇద్దరు రైల్వే ఉద్యోగులు,నలుగురు సింగరేణి ఉద్యోగులు,ఒక కేటీపీఎస్ ఉద్యోగి,ఒక న్యాయవాది,ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సభ్యులుగా



కొనసాగుతూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.2017 నుంచి ఇప్పటి వరకు పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు, భర్తను కోల్పోయిన ఒంటరి మహిళలకు,ఇల్లు నిర్మించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ప్రతి కుటుంబానికి రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.చిన్న సహాయం అయినప్పటికీ అది అవసరమైన సమయంలో ఒక కుటుంబానికి పెద్ద అండగా మారుతుందనే భావనతో ఈ సేవలను నిరంతరం కొనసాగిస్తున్నారు.ఈ నేపథ్యంలో గుంపెళ్ల గూడెం గ్రామ పంచాయతీ చిన్న కట్టు గూడెం గ్రామానికి చెందిన లకావత్ రాములు తీవ్ర వెన్నుముక నొప్పితో బాధపడుతూ అత్యవసర పరిస్థితిలో శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.కుటుంబ ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోవడంతో చికిత్స ఖర్చులపై ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకున్న గుంపెళ్ల గూడెం ఉద్యోగ సంఘం వెంటనే స్పందించింది. మానవత్వంతో ముందుకు వచ్చి లకావత్ రాములు కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ సేవా తత్వాన్ని మరోసారి నిరూపించుకుంది.ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ.."సమాజం మనకు ఎంతో ఇచ్చింది. ఇప్పుడు సమాజానికి తిరిగి ఇవ్వడం మన బాధ్యత. ఆపదలో ఉన్న వారికి మన వంతు చేయూత అందించడం ద్వారా వారి కష్టాలను కొంతైనా తగ్గించగలిగితే అదే నిజమైన సంతృప్తి" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరింత మంది నిరుపేదలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను విస్తరించాలని వారు సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం అధ్యక్షులు బానోతు వీరన్న ప్రధాన కార్యదర్శి గుగులోత్ శంకర్,కార్యవర్గ సభ్యులు టీచర్ బానోత్ వీరన్న,అశోక్,వినోద్,రాము తదితరులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచుల ఫోరం నూతన కమిటీ ఎన్నిక

బోథ్, జూన్ 16. (విజన్ ఆంధ్ర) : బోథ్ మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా సుద్దుల అరుణ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇట్టేడి రమణారెడ్డి, బండారి స్వామి, ప్రధాన కార్యదర్శిగా మామిడి సంతోష్, కోశాధికారిగా పుంద్రు విజయరాజా రెడ్డి లు ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా గోడం భీమరావు, సుందర్ సింగ్, దొమ్మటి రాజేందర్ లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా తలంపుల రమేష్ ఎన్నికయ్యారు.

మండలంలోని 21 గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు పాల్గొని నూతన కమిటీకి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు కోసం ఉప సర్పంచులందరూ ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించారు.

## లికొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తిరుపతి రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పోస్టర్ ఆవిష్కరణ



దౌల్తాబాద్ జూన్ 16 (విజన్ ఆంధ్ర) :ఈరోజు కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గ్రామంలో కోడంగల్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ తిరుపతిరెడ్డి చేతుల మీదుగా వాల్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది, ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ వేల కోట్లు వెచ్చించి కోడంగల్ నియోజకవర్గాన్ని విద్యా, ఉద్యోగ, వైద్య, రంగాలలో శరవేగంగా ముందుకు నడిపిస్తున్న “గౌరవనీయ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా అండదండలుగా ఉండాలని విజ్ఞప్తి చేయడం జరిగింది, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో కొడంగల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు ముందుండాలని గుర్తు చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావడం జరిగింది.

# నిబంధనలకు వ్యతిరేకంగా ఆల్ఫోర్స్ పాఠశాలలో నోట్ బుక్స్ అమ్మకం?

**- గతంలోనే ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాలు యూనిఫామ్ టై బెల్టులు అమ్ముతున్నారని విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం**

**- పుస్తకాలను సీజ్ చేయడమే కాకుండా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి ఏబీవీపీ**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 16 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాల విక్రయిస్తున్న ఆల్ఫోర్స్ పాఠశాల పుస్తకాలను స్థానిక ఏబీవీపీ స్టూడెంట్స్ విభాగం నాయకులు పట్టుకున్నారు. హుస్నాబాద్ ఎంఈఓ మనీలా పుస్తకాలను మంగళవారం రోజున సీజ్ చేయడం జరిగిందని ఏబీవీపీ నాయకులు తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా నోట్ పుస్తకాలు యూనిఫామ్ దుస్తులు అమ్ముతున్నారని వారం రోజుల క్రితమే విజన్ ఆంధ్ర పత్రికా కథనంలో హెచ్చరించిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వివరించారు. దీంతో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో విద్య ఒక వ్యాపారం లాగా కొనసాగుతుంది. విద్యాలయాల పేరుతో నోట్ బుక్కు,స్కూల్ యూనిఫామ్ టైప్ బెల్టులు అమ్ముకుంటూ మూడు పువ్వులు ఆరు కాయలు వ్యాపారం కొనసాగిస్తున్నారు.గత సంవత్సరం కూడా ఎన్నిసార్లు పట్టుబడినప్పటికీ సీజ్ చేయడం తప్ప చర్యలు తీసుకోవడంలో అధికారుల విఫలమైనారని విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విద్యను వ్యాపారం కాకుండా కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉందని పుస్తకాలను అమ్మడం నేరమని చర్యలు తీసుకోవాలని విద్యార్థులు విద్యార్థులు తెలియరులు కోరుతున్నారు.ఈ సందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ఆల్ఫోర్స్ పాఠశాలలో అక్రమంగా అమ్ముతున్నటువంటి పుస్తకాలు మరియు నోటుబుక్కులు సీజ్ చేయించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల పిల్లలకు చదువును దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని సరస్వతి నిలయాలుగా ఉండాల్సిన పాఠశాలలే వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారని మండిపడ్డారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పుస్తకాల విక్రయిస్తున్న ఆల్ ఫోర్స్ స్కూల్ పుస్తకాలను పట్టుకోవడంతో ఎంఈఓ వచ్చి పుస్తకాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ రాజేష్ జిల్లా ఎస్ఎఫ్ఐ కన్వీనర్ చరణ్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా కన్వీనర్ కుమార్ కళాశాల కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# నూతన తహసీల్దార్ ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



కుల్కచర్ల, జూన్, 16 (విజన్ ఆంధ్ర) : కుల్కచర్ల మండల తహసీల్దార్ గా పురుషోత్తం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి నూతన తహసీల్దార్ ను సన్మానించారు... కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ... రైతులకు భూ సమస్యలు లేకుండా చూస్తానని ఎప్పటికప్పుడూ పూర్తి విచారణ చేసి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజలందరూ కూడా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వెంకటయ్య, రవీందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవీందర్, ఆనందం ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

కేశంపేట విజన్ ఆంధ్ర 17 చింతకుంటపల్లి గ్రామంలో వేసవి సెలవులను ముగించుకొని పున ప్రారంభం లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల లను కాపాడుకోవాలంటే గ్రామ పాఠశాలలోనే విద్యార్థులందరిని చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ మరియు వసతి ఉంటాయని ఉచితంగా యూనిఫామ్ అందిస్తారని తెలిపారు. అనుభవం గల ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు ప్రైవేటు పాఠశాల ధీటుగా మన యొక్క గ్రామ పాఠశాల నడుస్తుంది కాబట్టి అందరూ మన గ్రామ పాఠశాలలో చేర్పించాలని సర్పంచ్ రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకుంటపల్లి గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ మరియు ఉపాధ్యాయులు సుచరిత షాహిన్ వార్డు సభ్యులు బైకని పంచాయతీ కార్యదర్శి మురళి నాయకులు శ్రీకాంత్ అనేమోని మల్లేష్ యాదవ్ ఆశ వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తాడిచెర్ల లో వైభవంగా శ్రీ వారాహి మాత మండల మహోత్సవం

**- 41 రోజుల మండల కాల వ్రత ముగింపు మహోత్సవం**

**- అమ్మవారి భక్తులు హాజరై కృపా కటాక్షానికి పాత్రలు కాగలరని పిలుపు**

మల్హార్, జూన్ 16 విజన్ ఆంధ్ర : మండల కేంద్రమైన తాడిచెర్ల లోని గౌండ్లవాడ లో గల “ఆనందమయి కనక దుర్గాదేవి నిలయము” లో శ్రీ వారాహి మాత వ్రత మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. సంతోష్ అయ్యగారు ఆధ్వర్యంలో గత 41 రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ మండల కాల వ్రతం బుధవారం నాటితో ముగింపు దశకు చేరుకుంది.ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం రోజున అమ్మవారి ప్రత్యేక ప్రతిష్టాపనా కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు భవాని భక్తులు, ఆత్మీయులు మరియు కుటుంబ సభ్యులు పేరుపేరునా తరలివచ్చి, అమ్మవారి దివ్య రూపాన్ని దర్శించుకుని అభీష్ట కార్యసిద్ధిని పొందాలని నిర్వాహకులు కోరుతున్నారు.కార్యక్రమానికి విచ్చేసే భక్తులందరికీ అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ (అన్నదానం) కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కావున ప్రతి ఒక్కరూ ఈ ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సంతోష్ అయ్యగారు ప్రార్థించారు.

## అమ్మ మాట - అంగన్వాడి బాటలో చిన్నారులు



కేశంపేట విజన్ ఆంధ్ర 17 మండల పరిధిలోని నిడద వెల్లి గ్రామ అంగన్వాడి కేంద్రం లో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు పాల్గొని అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషక ఆహారం నాణ్యమైన విద్య ఆటపాటల ద్వారా బోధన వంటి అంశాలపై అవగాహన పొందారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్వాడీ కేంద్రాల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రజిత విజయ్ కుమార్ నవనీత అంగన్వాడీ టీచర్ ఎస్ సులోచన ఆయా యాదమ్మ పాల్గొన్నారు. ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రానికి పంపి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని తల్లిదండ్రులను సూచించారు.



# సామాజిక సేవకు గుర్తింపు

## అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న రామచంద్రం

చిన్నశంకరంపేట (విజన్ ఆంధ్ర )మండలం సామాజిక వర్గాలకు చేసిన సేవలను గుర్తించిన లైయన్స్ ఇండియన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సరస్వతి ఆడిటోరియంలో జరిగిన బహుజన ఆత్మీయ సదస్సు కార్యక్రమంలో చిన్న శంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామానికి చెందిన ముత్తిగల రామచంద్రం అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికై నేడు అవార్డు రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షులు డాక్టర్ ఆకుల రమేష్ కృష్ణ గోవర్ధన్ సామ్రాట్ చేతులమీదుగా అందుకున్నారు. మంగళవారం ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ, తన సేవలను గుర్తించిన లైన్స్ ఇండియన్ ఈ అవార్డు తనకిచ్చి మరింత భారం పెంచిందన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా అంబేద్కర్ ఐడియాలజీ ప్రజల్ని చైతన్యవంతం చేయడం కుల వివక్ష మూడో నమ్మకాలు అంటరానితనం నిర్మూలన కోసం గ్రామస్థాయి నుండి మండల జిల్లా స్థాయి వరకు అనేక ఉద్యమ పోరాటాల నేపథ్యం అందుకే కాబోలు ఈ గౌరవం అని తప్పకుండా మండల ప్రజలకు సామాజిక వర్గాల ప్రజలందరికీ న్యాయం కోసం అండగా నిలబడి ముందుకు సాగుతారని ఆయన గుర్తు చేశారు కార్యక్రమాలు ఈ కార్యక్రమంలో కాడిగళ్ల మల్లేశం, కర్నే సాయిలు, తదితరులున్నారు

# బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

## - మంత్రిని కోరిన ఆడే గజేందర్

బోథ్, జూన్ 16. (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ కోరారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో దళిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, ప్రజ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యల పరిష్కారం పట్ల మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆడే గజేందర్ తెలిపారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని మంత్రి తెలిపినట్లు ఆడే గజేందర్ తెలిపారు.



# హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం

## - శాతవాహన యూనివర్సిటీఛాన్స్ లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 16 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శాతవాహన యూనివర్సిటీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ సోమవారం రోజున విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెరుగైన విద్య వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పిస్తూ ఈ ప్రాంత విద్యార్థుల కొరకు హుస్నాబాద్ ప్రాంతంలో హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాల ప్రభుత్వ ఏర్పాటు చేసిందన్నారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఏప్సెట్ మరియు ఈసెట్ అర్హత సాధించిన విద్యార్థులకు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల జూన్ 19వ తేదీ నుండి ప్రారంభం అవుతుందని అర్హులైన విద్యార్థులు హుస్నాబాద్ ఇంజనీరింగ్ కళాశాలలో తప్పక అడ్మిషన్లు తీసుకోవాలని ఈ ప్రాంత విద్యార్థులను కోరారు. హైదరాబాద్ వరంగల్ లాంటి పట్టణాలలో లక్షలు ఖర్చుపెట్టి ప్రైవేట్ కళాశాలలో చదువుతూ ఆర్థికంగా నష్టపోతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి పొన్నం ప్రభాకర్ ప్రోత్సాహంతో అన్నివసతుకతో శాతవాహన యూనివర్సిటీ గవర్నమెంట్ ఇంజనీరింగ్ కాలేజీ హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రోత్సాహంతో ఏర్పడిందన్నారు. ఈ కళాశాలలో ప్రస్తుతం సిఎస్ఇ, ఏఐ, ఐటి, ఈసిఈ, కోర్సులు ఉన్నాయని ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయన్నారు. ఇంజనీరింగ్ కళాశాల కొరకై ఉమ్మాపూర్ వద్ద 36 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని కాలేజీ భవనంతో పాటు అబ్బాయిలకు అబ్బాయిలకు వేరువేరుగా ప్రత్యేక హాస్టల్ భవనాల కొరకు నిధులు మంజురయ్యాయన్నారు. టెండర్లు కూడా పూర్తి అయ్యాయని ఈ నెల ఆఖరు వరకు శంకుస్థాపన కూడా జరుగుతుందన్నారు. అన్ని కోర్సులకు ఫిజిక్స్ ల్యాబ్, కెమిస్ట్రీ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, వర్క్ షాప్ లాంటి సౌకర్యాలు ఉన్నాయని, ల్యాబ్ లను ప్రారంభించారు. గత సంవత్సరం ఎన్ఆర్ఐల సహకారంతో విద్యార్థులకు సైకిళ్లు ఇప్పించామని ఈ సంవత్సరం నుండి ఫస్ట్ ఇయర్ లో కాలేజీ టాపర్ గోల్డ్ మెడల్ కూడా అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్టర్ సతీష్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ

జన్నారం, జూన్ 16 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ జక్కు సుష్మ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా సోమవారం రోజున జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపరి ధికి చెందిన అక్కపెల్లిగూడ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ జక్కు సుష్మ పాల్గొని పాఠశాలకు వచ్చే విద్యార్థులకు మంగళహారతితో ఘన స్వాగతం ప లికారు. అనంతరం ప్రభుత్వం అందజేసే ఉచిత పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్స్ ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందిస్తు న్నారని ప్రతి ఒక్క తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమేష్, వార్డు మెంబర్లు పిల్లి మల్లయ్య, ముద్ర కోలా హారిక రవి, అమ్మ ఆదర్శ



పాఠశాల కమిటీ చైర్మన్ రమాదేవి, ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యా యులు శెట్టి రాజశేఖర్, అంకం కరుణ, సుదీప, తేజ, శ్రీలత ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

## - వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

## - ఏన్కూరులో విస్తృత పర్యటన

ఏన్కూరు, జూన్ 16(విజన్ ఆంధ్ర): అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నట్లు వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ తెలిపారు. మంగళవారం ఏన్కూరు మండలంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ మేరకు మండల పరిధిలోని తిమ్మారావుపేట గ్రామంలో రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ ఏడీ కార్యాలయానికి భూమి పూజ చేశారు. అనంతరం బురదరాఘవాపురం గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారు. పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యే విధంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ ల సంఖ్యను



పెంచుతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లతో ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసచారి, ఎస్ఏఓ శ్రీధర్, డీఈలు బుద్దుపవర్, రమేష్, ఏడీఈ యాసీన్, ఏఈ ఉమాకాంత్, ఎంపీడీఓ పల్లి భాగ్యశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోతు లచ్చిరాం నాయక్, మాజీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, నాయకులు మేడ ధర్మారావు, కొప్పుల ప్రభావతి రెడ్డి, వాసిరెడ్డి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా బుకింగ్ యాప్ అందుబాటులో

పెద్ద శంకరంపేట్, జూన్ 16; విజన్ ఆంధ్ర: రైతులకు యూరియా ఎరువుల సరఫరాను మరింత పారదర్శకంగా, సులభంగా అందించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన యూరియాను ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. యాప్‌లో రైతులు తమ ఆధార్, మొబైల్ నంబర్ లేదా రైతు నమోదు వివరాలతో లాగిన్ అయి సమీప ఎరువుల దుకాణాన్ని ఎంపిక చేసుకుని అవసరమైన యూరియా పరిమాణాన్ని బుక్ చేసుకోవచ్చు. బుకింగ్ విజయవంతమైన వెంటనే రైతుల మొబైల్‌కు నిర్ధారణ సందేశం అందుతుంది. నిర్ణీత తేదీన సంబంధిత ఎరువుల దుకాణంలో యూరియాను పొందవచ్చు. ఈ విధానం ద్వారా ఎరువుల కొరత, అనవసర రద్దీ తగ్గడంతో పాటు రైతులకు సమయానికి యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను పొందాలని వ్యవసాయ శాఖ సూచించింది.

## పెండింగ్ వేతనాలపై నల్లబ్యాడ్జీలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

బెల్లంపల్లి, జూన్ 16 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో పాటు ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి ప్రాంగణంలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఓం నారాయణ, మంచిర్యాల జిల్లా వైస్ ప్రెసిడెంట్ దుర్గ ప్రసాద్, జనరల్ సెక్రటరీ కిరణ్‌తో పాటు శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్, ఎన్‌హెచ్‌ఎం, 104 సర్వీసులు తదితర విభాగాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మృగశిర కార్తీ సందర్భంగా జమ్ములమ్మ దేవతకు దర్శించుకున్నా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి జూన్ 16(విజన్ ఆంధ్ర బ్యూరో ):మృగశిర కార్తీ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని 23వ వార్డులో జమ్ములమ్మ ఆలయం సందర్శించి అమ్మవారికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గతములో దేవాలయ నిర్మాణాన్నికి 5లక్షల రూపాయలు కేటాయించి అభివృద్ధికి కృషి చేశామని భవిష్యత్తులో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అభివృద్ధి చేస్తామని అన్నారు. పట్టణ ప్రజలు జమ్ములమ్మ దేవత ఆశీషులతో పాడిపంటలతో సుఖసంతోషాలతో సౌభాగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. నిరంజన్ రెడ్డి నాయకులు మెకానిక్.శ్రీను,ఉగ్గం. తిరుమల్, నందిమల్ల.శారదా అశోక్ ఘనంగా స్వాగతం పలికి ఆహ్వానించా రు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల. అశోక్ సబ్బిరెడ్డి. యుగంధర్ రెడ్డి, శ్రీనివాస్పూర్. నరసింహ, వీర సాగర్, సూర్యవంశం. గిరి, చిట్యాల. రాము, పెద్దముక్కుల. రవి, ఇమ్రాన్, మునికుమార్, చెన్నారెడ్డి, సబ్బిరెడ్డి. రవీందర్ రెడ్డి, ఎంట్ల.శ్రీను, గౌనికాడి.యాదయ్య, తోట. శ్రీను, కుమ్మరి. రామస్వామి తదితరులు ఉన్నారు.




# ఉపాధి హామీ కూలీలకు మహిళా భద్రతపై అవగాహన



బెల్లంపల్లి జూన్ 16 విజన్ ఆంధ్ర : మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు షీ టీమ్ పోలీసులు ఉపాధి హామీ కూలీలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో మంగళవారం కాసిపేట మండలంలోని కాసిపేట గ్రామంలో షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మహిళలపై జరుగుతున్న వేధింపులు, ఈవ్‌టీజింగ్ నివారణ, సైబర్ నేరాల జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు, అలాగే మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టీ-సేఫ్ (T-Safe) యాప్ వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. మహిళలు ఎలాంటి వేధింపులు ఎదురైనా తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100తో పాటు రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల జిల్లా షీ టీమ్ నంబర్ 8712659385 ను సంప్రదించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు భరోసా ఇచ్చారు. మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి మహిళ షీ టీమ్ సేవలను వినియోగించుకోవాలని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్‌తో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీ అంబర్ కిశోర్ ఝా



బెల్లంపల్లి జూన్ 16 విజన్ ఆంధ్ర : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంగళవారం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను సమగ్రంగా పరిశీలించి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
సర్కిల్ పరిధిలో నమోదవుతున్న కేసులు, ఫిర్యాదుల స్వీకరణ, పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు ఫైళ్లను ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు అధికారులు విధుల పట్ల అంకితభావంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. తీవ్రమైన కేసుల్లో జాప్యం లేకుండా నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. దర్యాప్తులో భౌతిక ఆధారాలతో పాటు సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. నేరాల నియంత్రణ కోసం అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర తనిఖీలు చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్ట పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను చైతన్యపరచాలని, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా కల్పించేలా వ్యవస్థ పనిచేయాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100ను వినియోగించాలని సూచించారు.
తనిఖీ అనంతరం పోలీస్ అధికారులతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్, ఎస్ఐలు కిరణ్ కుమార్, రామక్రిష్ణ, ఏ ఎస్సై అలీ , పోలీస్ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

# వలిగొండ భద్రాచలం తొర్రూరు బైపాస్ రోడ్డు భాగంలో 40 కుటుంబాలు - వీధిన పడ్డాయి

**- నోటీసులు ఇవ్వకుండా రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్.**

**- ప్రజా పాలనలో భాగంగా ఆర్డీఓ కు వినతి పత్రం.**



తొర్రూర్ జూన్ 16 (విజన్ ఆంధ్ర) : వలిగొండ భద్రాచలం హైవే రోడ్డు నిర్మాణంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మున్సిపల్ పరిధిలోని 221 వ సర్వే నెంబర్ లో 40 మంది కుటుంబాలు గత పది సంవత్సరాలుగా ఖరీదు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించి ప్లాట్లు కొనుక్కున్న 40 మంది కుటుంబాలు వీధిన పడ్డాయి. తమ పిల్లల భవిష్యత్తు కోసం కొనుక్కున్న ప్లాట్లను ప్రభుత్వ అధికారులు రోడ్డు కాంట్రాక్టర్ బాధితులకు తెలియకుండానే ఆక్రమించుకొని రోడ్డును సదును చేసి రోడ్డు పనులు మొదలు పెట్టడంతో తొర్రూర్ లో ప్లాట్లు కొనుక్కున్న కుటుంబాలు సుదూర ప్రాంతాలలో బ్రతుకుతెరువు కోసం వెళ్లి తమ పిల్లలను చదివించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటూ ఉన్న యజమానుల కు ఈ వార్త లేటుగా తెలియడంతో గత వారం పది రోజుల నుంచి ఒక్కొక్కరుగా ఎక్కడెక్కడ ఉన్నారో వారందరిని పోగేసి సోమవారం ప్రజాపాలనలో తమ బాధలను ఆర్డిఓ గణేష్ కు వినతి పత్రం సమర్పించినారు. రెక్కాడితే తే డొక్కాడ లేని ప్రజలు తమ కుటుంబాలకు న్యాయం చేయాలని అధికారులనుకోరుతున్నారు. ప్రజా పాలనలో తమ బాధలను చెప్పుకుంటే సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకంతో ఆర్డీవోకు వారి గోడును విన్నవించుకున్నారు. ఆర్డీవో ప్రభుత్వం నుంచి తమకు నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# కోట మైసమ్మ దేవస్థానం ఈవోగా కటుకూరి వెంకటయ్య

**- మంగళవారం బాధ్యతలు స్వీకరించిన వెంకటయ్య**



కారేపల్లి,జూన్ 16 (విజన్ ఆంధ్ర) కోట మైసమ్మ దేవస్థానం ఈవోగా కటుకూరి వెంకటయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.శ్రీ కోట మైసమ్మ దేవస్థానంలో గత కొంతకాలంగా కార్యనిర్వహణ అధికారిగా పనిచేసిన కొండకింద వేణుగోపాలచార్యులు బదిలీపై వెళ్లగా ఆ స్థానంలో వరంగల్ జిల్లా రంగసాయిపేట ఉరుసు నాగేశ్వర స్వామి దేవాలయంలో విధులు నిర్వహించిన వెంకటయ్య బదిలీపై కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలోని శ్రీ కోట మైసమ్మ దేవస్థానానికి బదిలీపై వచ్చారు.



# బట్వాన్‌పల్లిలో దగ్ధమైన ఇంటి బాధిత కుటుంబానికి

## - టీడీపీ 50 కిలోల బియ్యం పంపిణీ...

బెల్లంపల్లి జూన్ 16 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన వికలాంగుడు జాడి శ్రీనివాస్ ఇల్లు ఇటీవల షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. మంగళవారం తెలుగుదేశం పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామటెంకి హరిబాబు, నియోజకవర్గ కన్వీనర్ టీ. మణిరాం సింగ్ మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించడంతో పాటు తాత్కాలిక పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోమాస రాజన్న, గోమాస వెంకటేష్, రత్నం అరుణ్, పగిడి అర్జయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే మెచ్చ జన్మదిన వేడుకలు



దమ్మపేట విజన్ ఆంధ్ర జూన్ 16: దమ్ము పేట మండల కేంద్రంలో అశ్వరావుపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక మట్టి భక్తాంజనేయ స్వామి దేవాలయంలో మెచ్చ పేరుతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు,పండ్లు, బ్రేడ్స్, అందచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు దొడ్డ రమేష్, దారా యుగంధర్, దార మల్లికార్జునరావు,జలగం వాసు,జిన్నా, సుశీల, వార్డ్ సభ్యులు, దారా రాము, లక్ష్మినారాయణ, రాంబాబు, మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాలో డబ్బులు మాయం....!

## - న్యాయం చేయండి...కళాకారుడు ఆవేదన

నేలకొండపల్లి, జూన్ 16 (విజన్ ఆంధ్ర ): కళాకారుల పింఛన్ తో జీవితం గడుపుతున్న కళాకారుడు బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు మాయమాయ్యయి. సమగ్ర విచారణ చేసి నా డబ్బులు రికవరి చేయాలని వేడుకున్నారు. బాధితుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం గ్రామానికి చెందిన ఏపూరి సత్యనారాయణ అనే కళాకారుడు ఖాతా లో నుంచి రూ.21,500 డ్రా చేశారు. ఇటీవల కళాకారుడు పెండింగ్ పింఛన్ మొత్తం రూ.90 వేలు తన ఖాతాలో జమ చేశారు. కాగా ఆ మొత్తం నుంచి రూ.69,400 లను రెండు పర్యాయాలు డ్రా చేసుకున్నానని తెలిపారు. తరువాత మంగళవారం డబ్బులు అవసరం ఉండి ఏటీయం . వద్ద కు వెళ్లితే ఖాతా జీరో బ్యాలెన్స్ చూపిస్తుందన్నారు. అనుమానం తో 'స్టేట్మెంట్ ను పరిశీలిస్తే డ్రా చేసిన విషయం తెలుసుకుని అవాక్కయ్యారు. కానీ మిగతా సొమ్ము తన కు తెలియకుండానే రూ.21,500 నగదు ను పలుమార్లు ఏటీయం ద్వారా డ్రా చేశారని పేర్కొన్నారు. గత నెల 15 వ తేదిన 4,500, 18 న 5. వేలు, 23 న రూ. 10 వేలు, మరో మారు రూ.1 లను ఏటీయం వద్ద డ్రా చేశారు. ఈ డబ్బులు మెత్తం కూడ ఖమ్మం లోని ఓ ఏటీయం వద్ద డ్రా చేసినట్లు స్టేట్మెంట్ లో ఉంది. కానీ ఆ ఏటీయం ఎక్కడ ఉందో కూడ బాధితుడు కు తెలియదు. కేవలం కళాకారుల పెన్షన్ పై ఆధారపడి జీవిస్తున్న తమ ఖాతా నుంచి గుర్తు తెలియని దుండగులు మాయం చేశారని... సమగ్ర విచారణ చేసి రికవరి చేసి తమకు అప్పగించాలని సైబర్ క్రైమ్ పోలీసుల ను ఆశ్రయించారు.



# పెద్దగూడెం అభివృద్ధికి సహకరిస్తాను - ఎంపీ నగేష్

బోథ్, జూన్ 16. (విజన్ ఆంధ్ర) పెద్ద గూడెం అభివృద్ధికి సంపూర్ణ సహకారంను అందిస్తానని పార్లమెంట్ సభ్యులు జీ. నగేష్ అన్నారు. సోనాల మండలంలోని పెద్దగూడెం గ్రామస్తులు మంగళవారం ఎంపీని కలిసి గ్రామానికి సంబంధించి పలు సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా వర్ష కాలం ప్రారంభం అయిన నేపథ్యంలో పల్లెకు రాకపోకలను కొనసాగించడానికి ఇబ్బందిగా ఉందని, తమ పల్లెకు బ్రిడ్జి పక్కన సిసి రోడ్, సైడ్ వాల్ ను నిర్మించాలని కోరారు. సమస్య పరిష్కారం పట్ల సానుకూలంగా స్పందించిన ఎంపీ తప్పకుండా సాంక్షన్ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పల్లె వాసులు ఎంపీ కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో చింతలబోరీ గ్రామ ఉపసర్పంచ్ డీగోడే విష్ణు, గ్రామ పటేల్ , కారోబర్, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మహాసభ ల కరపత్రాలు విడుదల

పెబ్బేరు, జూన్ 16 (విజన్ ఆంధ్ర ) : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామం లో ఉపాధి పని ప్రదేశం లో మంగళవారం నాడు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ. జిల్లా ఉపాధ్యక్షులు దేవన్న మాట్లాడుతూ సంఘశీ రాష్ట్ర 4వ మహాసభ లు ఈ నెల 20.21.22.తేదీలలో మహబూబ్ నగర్ పట్టణశీ జరుగుతాయని,20న జరిగే బహిరంగ సభ కు ముఖ్య అతితి గా త్రిపుర మాజీ ముఖ్య మంత్రి మాణిక్ సర్కార్. కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని విరభద్రం.. కెవి పిఎస్ రాష్ట్రఅధ్యక్షులు.జాన్ వెస్లీ. అఖిల భారత వ్యవసాయకార్మిక సంఘశీ. ప్రధాన కార్యదర్శి బి. వెంకట్.శివ దాసన్. ఎంపీ.లు హాజరు అవుతున్నారని తెలిపారు.. మొదటి రోజు 20న మహబూబ్ నగర్ టౌన్ హాల్ నుంచి భారీ ప్రదర్శన. జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో బహిరంగ సభఉంటుందని తెలిపారు 21.22.తేదీలలో 33జిల్లాల నుంచి 1000మంది ప్రతినిధులు హాజరు అవుతు న్నారు.దేశం లో బిజెపి ఉపాధిని ఎత్తేశే క్రమంలో. కొత్తగా నరేగా చట్టం తెచ్చి కేంద్రం యిచ్చే 90%నిధులను 60%కి తగ్గించారని దింతో రాష్ట్ర ప్రభుత్వాలు 40%భరించలనే కొర్రి పెట్టటడం తో రానున్న రోజుల్లో ఉపాధి హామీ చట్టం లో కూలీలకు పనిదినాలు కల్పించడం లో కేంద్రం విఫలం అవుతుందని విమర్శించారు. కనీసవేతనాలు అమలు చేయాలనీ. రేషన్ షాప్ ల ద్వారా 14రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలని డీమాండ్ చేశారు. ఈ కార్యక్రమం కూలీలు శంకర్. అనిల్ నాగరాజు బాలయ్య.రాముడు.సాయులు సంజీవ తదితరులు పాల్గొన్నారు

# బేటీ బచావో బేటీ పడావో, మహిళల చట్టాల పైన అవగాహన మరియు అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహణ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా జూన్ 16 (విజన్ ఆంధ్ర ) ఘనపూర్ మండలం, ధర్మరావుపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు మరియు జిల్లా సంక్షేమ అధికారి మల్లీ శ్వరి సూచనల మేరకు లిలిబేటీ బచావో బేటీ పడావో అవగాహనలిలి, మరియు లిలిఅక్షరాభ్యాసం కార్యక్రమంలిలి ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని సూపర్వైజర్ శ్రీమతి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పూజారి రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అనేది ప్రతి బిడ్డకు ప్రాథమిక హక్కు అని, బాలురు -- బాలికలు అనే తేడా లేకుండా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. బాలికల విద్య కుటుంబాభివృద్ధికి, సమాజ పురోగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు.

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇంచార్జి మిషన్ కోఆర్డినేటర్ శ్రీ క్రిష్ణ గారు మాట్లాడుతూ మహిళల సాధికారత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్యాభివృద్ధి మరియు మహిళల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలపై అవగాహన



కల్పించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. అలాగే మహిళలు మరియు బాలికల కోసం అందుబాటులో ఉన్న 181 మహిళా హెల్ప్‌లైన్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు మరియు 14567 సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్‌లిలి సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని తెలిపారు.

జెండర్ స్పెషలిస్ట్ శ్రీమతి అనూష కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా లిలిబేటీ బచావో బేటీ పడావోలిలి వంటి పథకం బాలికల విద్య, భద్రత మరియు ఆర్థిక భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. కుటుంబాల్లో బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని పేర్కొన్నారు

సూపర్వైజర్ శ్రీమతి లక్ష్మి అమ్మ మాట -- అంగన్వాడి బాట కార్యక్రమం ద్వారా మూడు సంవత్సరాలు నిండిన ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యవంతమైన తరాన్ని నిర్మించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది క్రిష్ణ, అనూష, సురేష్ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కొండపాకలో ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 16 : సిద్దిపేట జిల్లా కొండపాక స్థానికుల కథనం ప్రకారం మండలంలోని డబుల్ బెడ్ రూమ్స్ లో నివాసముంటున్న మేడిపల్లి రాజు 30 సంవత్సరాలు మంగళవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు . ఉదయం లేచి చూసేసరికి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. ఆయన మృతి చెందిన కారణాలు పోలీసుల దర్యాప్తు ద్వారా తెలియాల్సింది

# చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించవద్దు

## - ఎమ్మెల్యేకు సీఐటీయూ వినతి



దమ్మపేట, విజన్ ఆంధ్ర జూన్ 16: –దమ్మపేట సెంటర్‌లో రహదారికి ఇరువైపులా నిర్వహిస్తున్న చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించకుండా వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకువినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ, దమ్మపేట సెంటర్‌లోని దుకాణదారులు డ్రైనేజీ పూడికతీత పనులను స్వయంగా కార్మికులను నియమించుకుని నిర్వహిస్తూ గ్రామపంచాయతీకి సహకరిస్తున్నారని తెలిపారు. చిన్న పెట్టుబడులతో వ్యాపారాలు నిర్వహిస్తూ అనేక కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని అన్నారు. అయితే గ్రామపంచాయతీ అధికారులు ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేస్తున్న వారిని తొలగించి వేరే ప్రాంతానికి తరలిస్తామని, నాలుగు రోజుల వ్యవధిలో దుకాణాలను ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా అదే ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులను బలవంతంగా ఖాళీ చేయించడం సరైంది కాదనిపేర్కొన్నారు.వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా వారి సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి, రఘు, పుల్లారావు, యుగంధర్, సుమన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరమే అభివృద్ధికి తొలి అడుగు

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం మంబాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్యాభ్యాసానికి శుభారంభంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అక్షరాల ప్రాముఖ్యతను వివరించి, వారి చేత తొలి అక్షరాలను దిద్దించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారి జీవితంలో అక్షరాభ్యాసం ఒక కీలక మైలురాయి అని, విద్య ద్వారానే మంచి భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు అందించారు. పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడగా, విద్యార్థులు ఉత్సాహంగా అక్షరాభ్యాసంలో పాల్గొని తమ విద్యా ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు సుజాత, ప్రీ ప్రైమరి పాఠశాల ఉపాద్యాయిని గంగోజిపేట రూప, శ్రీనివాస్ శర్మ, అమ్మ ఆదర్ష పాఠశాల చైర్మెన్ ఇస్తారి గంగ, వార్డు సభ్యులు ఇస్తారి బాస్కర్, కొండని నీలవతి, సంపంగి మౌనిక, మరియు అశోక్ చారి కంజర్ల వేంకటస్వామి, మీసాలబాబు, తదీతరులు పాల్గోన్నారు

# ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో భద్రత ప్రమాణాలు ఎక్కడ..?

## స్కూల్ బస్సులపై తల్లిదండ్రులు ప్రశ్నించాలి..

### పిఎస్ఫై ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పసుల వినయ్ కుమార్..



భూపాలపల్లి జిల్లా రేగొండ,జూన్16( విజన్ ఆంధ్ర ): విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాల బస్సులలో భద్రత ప్రమాణాలు పాటించకుండా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల జాడ కానరావడం లేదని ఉమ్మడి వరంగల్ జిల్లా

ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు పసుల వినయ్ కుమార్ ఆరోపించారు. ప్రవేట్ స్కూల్ బస్సుల పై పిల్లల తల్లిదండ్రులు యజమాని ప్రశ్నించాలని వినయ్ కుమార్ కోరారు. ఈ మేరకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్య విద్యార్థుల దోపిడిని అరికట్టి ఫిట్నెస్ కలిగివున్న బస్సులను కలిగి ఉండేలా అధికారులు చూడాలని కోరారు. జిల్లా అధ్యక్షులు వినయ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ..ఫిట్నెస్ లేని బస్సులను సీజ్ చేసే ఆర్టీఏ అధికారులు ఎక్కడా అని పి ఎస్ ఎఫ్ ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పసుల వినయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేట్ స్కూల్ యజమాన్యాలు పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండల జిల్లా విద్యాశాఖ అధికారులు ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. భద్రత ప్రమాణాలు లేకుండా స్కూల్ బస్సులు నడుస్తున్నాయని వినయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాతో పాటు, రేగొండ,గోరి కొత్తపల్లి మండల కేంద్రాల్లోని ప్రైవేటు పాఠశాలల యజమానులు ఇష్టరాజ్యాంగ వ్యవహరిస్తూ పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్నారని, దీని ద్వారా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. డ్రైవర్లు అనుభవం కలిగి లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఫైర్ సేఫ్టీ ఉండాలని, బస్సుల ఫిట్నెస్ తప్పనిసరిగా కలిగి ఉండాలని అలాంటి ప్రమాణాలు పాటించని ప్రవేట్ స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు వెంటనే సీజ్ చేయాలని, లేనిపక్షంలో ఎక్కడికక్కడ ప్రైవేట్ స్కూల్ బస్సులను అడ్డుకుంటామని పసుల వినయ్ కుమార్ హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం, జూన్ 16 (విజన్ ఆంధ్ర ) : కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 10 నెంబర్ లో పూసల కులాన్ని డీఎన్ఏ జాబితాలో చేర్చి, పూసల కులంతో పాటు 51 కులాలను డీఎన్టీలో పొందుపరిచి అధికారికంగా జీవో విడుదల చేశారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో పూసల సంఘం నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం జిల్లా అధ్యక్షులు నూతనగంటి సదానందం, పూసల అభివృద్ధి వేదిక అధ్యక్షులు నూతనగంటి పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి పన్నీరు వెంకటేష్, సీనియర్ నాయకులు వెంకటేష్, కుమార్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.



# బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉంది

## - టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.

## - బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా పేద బ్రాహ్మణులను ఆదుకుంటాం

## - ఉపాధ్యక్షుడు శ్రీ పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్



కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూన్ 16 : పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంని కైత్లాపూర్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ వారిని ఆత్మీయంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించడం జరిగింది. బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అమలు చేస్తున్నపథకాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు సహాయక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా, బ్రాహ్మణ సమాజ సంక్షేమం మరియు సాధికారతలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు తమ సమస్యలను వినతి పత్రం ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, బ్రాహ్మణుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ది చేకూరేలా చర్యలు తీసుకుంటామని, ఆయన మార్గదర్శకత్వంలో పరిషత్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని నాకు నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్ర ఆచార్య, హరి హర క్షేత్రం చైర్మన్ మూర్తి, సుబ్బారావు, పంచగంగేశ్వర్, శ్రీరంగం శ్రీనివాస చార్యులు, కొండపాక కృష్ణమాచార్యలు, శ్రీరంగం శేషాచార్యులు, కాండూరి మోహన్, శ్రీరంగం కృష్ణమాచార్యులు, శ్రీరంగం మోహన్, అభినయ్, చక్ర పాణి, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కొల్లాపూర్ ముదిరాజ్ సంఘ పోరాటానికి జాతీయ స్థాయిలో మద్దతు

**- బ్లాక్ నెంబర్ 10 తప్పుడు ప్రొసీడింగ్స్ పై ఎంపీ ఈటెల రాజేందర్ కు వినతి పత్రాన్ని ఇచ్చిన ముదిరాజ్ సంఘం సభ్యులు**

కొల్లాపూర్ జూన్ 16 : (విజన్ ఆంధ్ర) :నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రాజ ప్యాలెస్ భవనానికి దక్షిణ భాగంలో ఉన్న 500 చదరపు గజాల రిజిస్టర్ భూమిపై ఉన్న ముదిరాజ్ సంఘ భవనం, పేద విద్యార్థుల కోచింగ్ సెంటర్‌ను మున్సిపాలిటీ అధికారులు తప్పుగా బ్లాక్ నెంబర్10" కారణంగా కూల్చివేత జరిపి గత ఆరు సంవత్సరాలుగా అడ్డుకుంటోందన్న అంశంపై సంఘం పోరాటానికి జాతీయ స్థాయిలో మద్దతు లభించింది అని కొల్లాపూర్ ముదిరాజ్ సంఘం సభ్యులు అన్నారు. మంగళవారం హైదరాబాద్ లో ఎంపీ ఈటెల రాజేందర్ నివాసంలో కొల్లాపూర్ ముదిరాజ్ సంఘం సభ్యులు సంఘం సమస్యపై వినతి పత్రాన్ని ఇచ్చారు, కూల్చిన తమ ముదిరాజ్ సంఘం భవనానికి న్యాయం చేయాలని వాళ్లు ఎంపీని కోరారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం కొల్లాపూర్ ముదిరాజ్ సంఘ ఇంచార్జి అధ్యక్షుడు తూర్పు కుమారస్వామి ముదిరాజ్ గారితో కలిసి జి/180/కొల్లాపూర్/2021 అనే తప్పుడు ప్రొసీడింగ్స్‌పై రిప్రజెంటేషన్ పై రిజిస్టర్ డీడ్‌లో భూమి బ్లాక్ 3గా నమోదు ఉన్నప్పటికీ, యజమాని కూడా బ్లాక్ 3ని ఒప్పుకున్నప్పటికీ, మున్సిపాలిటీ తమ కల్పిత కారణాలతో బ్లాక్ 10 అని చెప్పి భవాన్ని కోల్పోయే చర్యలు చేపట్టిందని సంఘం సభ్యులు విన్నవించారు.

ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ ముదిరాజ్ ముందుగా



సంఘ ఉపాధ్యక్షురాలు తుమ్మల శారదారాములు ముదిరాజు గారిని శాలువాతో సన్మానించి, "రిజిస్టర్డ్ డాక్యుమెంట్లున్నా వారిని అడ్డుకోవడం అన్యాయం అని ఎంపీ సానుకూలంగా స్పందించారు. అలాగే మున్సిపాలిటీ సమస్యకు వెంటనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ ఇంచార్జి అధ్యక్షులు తూర్పు కుమారస్వామి ముదిరాజ్ , ఉపాధ్యక్షురాలు తుమ్మల శారదా రాములు ముదిరాజు , సంఘ భాద్యులు కోట్ల అరుణ జోగేందర్ ముదిరాజు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



# విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి..

**- సబ్‌స్టేషన్ ముందు ధర్నా**

రేవల్లి జూన్ 16 ( విజన్ ఆంధ్ర ) మండలానికి చెందిన కాల లక్ష్మణ్(32) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రేవల్లి సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్ కింద ప్రైవేట్ విద్యుత్ కార్మికుడిగా పనిచేస్తున్న ఆయన, సోమవారం ఓ రైతు పొలంలో విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదానికి గురైనట్లు సమాచారం. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రేవల్లి సబ్‌స్టేషన్ ముందు రోడ్డుపై ధర్నా చేపట్టారు. కుటుంబానికి ఆదరణమైన వ్యక్తి ఒక్కసారిగా దూరం కావడంతో భార్య పిల్లలు రోడ్డు పాలయ్యారు అని లక్ష్మయ్య మరణానికి బాధ్యులు ఎవరో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకొని ఆర్థిక పరిహారం ఇవ్వాలని కోరుతూ కుటుంబ సభ్యులు గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.

స్థానిక ఎస్సై రజిత ,

గోపాల్పేట ఎస్సై శశిధర్ పరిస్థితిని సమీక్షించి బాధ్యత కుటుంబ సభ్యులకు మరియు విద్యుత్ అధికారులతో చర్చించి బాధితునికి తాగు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ఆందోళన విరమించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 2 క్రెడిట్ ఏఐ శిక్షణ



భైంసా, జూన్ 16:విజన్ ఆంధ్ర : విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, మేధోశక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భైంసాలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 2 క్రెడిట్‌ల కృత్రిమ మేధస్సు (ఏఐ) శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నిర్మల్‌కు చెందిన మాస్టర్ ట్రైనర్ పి. స్వాతి విద్యార్థులకు ఏఐ ప్రాముఖ్యత, వినియోగం, భవిష్యత్ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో కృత్రిమ మేధస్సు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఏఐ సాంకేతికతను నేర్చుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐపై అవగాహన పెంచుకోవడం ద్వారా విద్యా, ఉపాధి రంగాల్లో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు.కళాశాల ఏఐ కోఆర్డినేటర్లు డా. కల్పన, డా. జె. ఓం ప్రకాష్, కె. దివ్యల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. భీమారావు, డా. పవన్ కుమార్, డా. శంకర్, డా. రవికుమార్, ఎ. రాజు, డా. సంతోష్, డా. నహేద, అర్షియా సుల్తానా, వహీద్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై ఏఐపై ఆసక్తి కనబరిచారు.రెండు రోజులపాటు నిర్వహించిన మాస్టర్ ట్రైనర్ శిక్షణ అనంతరం కళాశాల కోఆర్డినేటర్లు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. అనంతరం జూలై 1 నుంచి 15 రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో "అన్న-అక్క మెంటర్‌షిప్" కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఏఐపై అవగాహన తరగతులు నిర్వహించనున్నారు. విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని కళాశాల వర్గాలు వెల్లడించాయి.

# పెద్దమ్మగుడి నూతన ఈ.ఓగా ఎ. విజయకుమార్..

పాల్వంచ ప్రతినిధి జూన్ 16(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం పాల్వంచ లోని జగన్నాధపురం పెద్దమ్మ గుడి నూతన ఈవో గా ఏ విజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. దేవాదాయశాఖ, హైద్రాబాద్ వారి,ఉత్తర్వుల ప్రకారం శ్రీ భద్రకాళి దేవస్థానం, వరంగల్ నందు సూపరింటెండెంట్గా విధులు నిర్వర్తించుచున్న, అద్దెంకి విజయ కుమార్ పదన్నోతిపై మంగళవారం రోజున, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, కేశవాపురం-జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) నందు కార్యనిర్వహణాధికారి, గ్రేడ్-1 గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆలయ అర్చకులు మరియు సిబ్బంది స్వాగతం పలికి దేవాలయంలో పూజలు జరిపిన పిదప,అర్చకులు నూతన కార్యనిర్వహణాధికారి ఎ.విజయ్కుమార్ కు వేదాశీర్వచనం గావించారు.

# మలక్‌పేట్ యశోదా ఆసుపత్రిలో హైరిస్క్ బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్స విజయవంతం



మహబూబ్ నగర్ అర్బన్ జూన్ 16 (విజన్ ఆంధ్ర) : మలక్‌పేట్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన హైరిస్క్ బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించామని మహబూబ్‌నగర్ పట్టణంలో వైద్యులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా ముందారి తండాకు చెందిన 53 ఏళ్ల ముదావత్ రాజు నాయక్‌కు ఈ అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాపాయం నుంచి కాపాడామని తెలిపారు తీవ్రమైన ఛాతినొప్పి, చెమటలు పట్టడం, తల తిరగడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన రోగికి వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి. పరీక్షల్లో కరోనరీ ఆర్టరీ వ్యాధి, అక్యూట్ కారోనరీ సిండ్రోమ్, యాంటీరియర్ వాల్ గుండెపోటు, గుండె పంపింగ్ శక్తి తీవ్రంగా తగ్గిపోవడం, ట్రిపుల్ వెసెల్ డిసీజ్, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. రోగి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో అత్యవసర బైపాస్ శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు.

యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ వాస్క్యులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి ఎస్ ఆధ్వర్యంలో 2026 మార్చి 10న గుండెను ఆపకుండా నిర్వహించే ఆఫ్ పంప్ కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఒకే శస్త్రచికిత్సలో నాలుగు బైపాస్ గ్రాఫ్ట్‌లు అమర్చడంతో పాటు దెబ్బతిన్న కరోనరీ ధమనిలో ప్రత్యేక చికిత్స కూడా చేపట్టారు.

శస్త్రచికిత్స అనంతరం రోగికి వెంటిలేటర్ సపోర్ట్, ఆక్సిజన్ సహాయం, గుండె మందులు, యాంటీబయాటిక్స్, ఫిజియోథెరపీ, నిరంతర సీటీ ఐసీయూ పర్యవేక్షణ అందించారు. శస్త్రచికిత్స తర్వాత తొలి రోజే రోగిని వెంటిలేటర్ నుంచి తొలగించగా, ఎటువంటి ప్రధాన గుండె సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యం మెరుగుపడింది. అనంతరం రోగి నడిచే స్థితికి చేరుకుని స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో డిశ్చార్జ్ చేసేమన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ట్రిపుల్ వెసెల్ డిసీజ్, గుండెపోటు చరిత్ర, గుండె పంపింగ్ శక్తి తగ్గిపోవడం వంటి పరిస్థితుల్లో గుండెను ఆపకుండా నిర్వహించే శస్త్రచికిత్సలు అత్యంత సవాళ్లతో కూడుకున్నవని తెలిపారు. సమయానికి చికిత్స అందించడం వల్లే రోగి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని పేర్కొన్నారు.

యశోదా ఆసుపత్రి లో అత్యాధునిక కార్డియాక్ ఆపరేషన్ థియేటర్లు, ప్రత్యేక కార్డియాక్ ఐసీయూలు, అనుభవజ్ఞులైన నిపుణుల బృందం సహకారంతోనే ఇలాంటి అత్యంత క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని వెల్లడించింది. తెలంగాణలో అత్యాధునిక గుండె చికిత్సలకు యశోదా ఆసుపత్రులు విశ్వసనీయ కేంద్రంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

# బద్వేలులో విజయవంతంగా కూటమి విజయోత్సవ సభ

బద్వేలు,జూన్ 16 (విజన్ ఆంధ్ర)బద్వేలు పట్టణంలోని రాఘవేంద్ర గ్రాండ్ కళ్యాణ మండపంలో మంగళవారం కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం లోని నలుమూలల నుంచి నాయకులు, మహిళలు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.
రెండేళ్లలో ప్రజలకు ప్రభుత్వం కల్పించిన నమ్మకం,చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వక్తలు సవివరంగా వివరించారు,విజయోత్సవ సంబరాలకు హాజరైన చైర్మన్ శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, టిడిపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బాలిశెట్టి హరి ప్రసాద్,బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిశెట్టి సుప్రజ, టిడిపి నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరైయారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయగా సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్.
ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల విజయగాథలను ప్రతిబింబించిన వివిధ శాఖల ప్రత్యేక స్టాళ్లు, తిలకించారు. ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆర్డీవో చంద్రమోహన్ ప్రజాప్రతినిధులకు వివరించారు.ఆయా శాఖల అధికారులు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి,సంక్షేమం రెండు చక్రాలుగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ప్రతీకగా విజయోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బాలిశెట్టి హరి ప్రసాద్ ,బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నగిరి భైరవ ప్రసాద్, బి.కోడూరు మండలం టీడీపీ అధ్యక్షులు రామచంద్రా రెడ్డి, బద్వేలు మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ ,బీజేపీ జిల్లా కార్యదర్శి కేవీ రమణ,ఆర్య వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పరిటాల వెంకట సుబ్బయ్య, సీమాంక్ హాస్పిటల్ డైరెక్టర్ జహంగీర్ భాష, బద్వేలు నియోజకవర్గం నాయకులు చెరుకూరి రవికుమార్,పాపూరి బాలిరెడ్డి,కర్నాటి వెంకట రెడ్డి, ప్రహ్లాద రెడ్డి, దుగ్గిరెడ్డి, బాదిరెడ్డి వీరారెడ్డి,ఇమామ్ హుస్సేన్, కొంకుల రాంబాబు, మాచుపల్లి లక్ష్మి దేవి, చెరుకూరి చెంద్రాయుడు, ఓ. రమణారెడ్డి, జనసేన నాయకులు ఈశ్వర్ రెడ్డి, సింగంశెట్టి వెంకట సుబ్బయ్య, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## తూనికలపై తనిఖీలు నిర్వహించిన లీగల్ మెట్రాలజీ శాఖ అధికారి

బద్వేలు,జూన్ 16: (విజన్ ఆంధ్ర) నియోజకవర్గంలో తూనికలు కొలతల పై లీగల్ మెట్రాలజీ శాఖ అధికారి రమేష్ కుమార్ రెడ్డి మంగళవారం పోరుమామిళ్ల, బద్వేలు మండలాల్లో లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు విస్తృతమైన తనిఖీలు నిర్వహించారు.ఇందులో భాగంగా పత్తి తూకాలు వేస్తున్న ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్స్(కాటాలు) చెక్ చేసి అందులో తేడాలు ఉండడం గుర్తించామని.దీనిపైన కేసు నమోదు చేసి సీజ్ చేయడం జరిగిందన్నారు.అంతే కాకుండా ఎరువులు, మరియు ఎలక్ట్రికల్ షాపు కిరాణా దుకాణాలలో కూడా తనిఖీలు నిర్వహించి మొత్తం ఐదు కేసులు నమోదు చేయడం జరిగిందనీ.ఈ తనిఖీల్లో అసిస్టెంట్ కంట్రోలర్ గౌస్ బాషా రియల్ మెట్రో జీన్స్ పెట్టారు.వెరిఫికేషన్ చేయని కాటాలు వాడిన తూకాలు తక్కువగా ఇచ్చిన అధిక ధరలకు అమ్మిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ కంట్రోలర్ గౌస్ బాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# దాతృత్వాన్ని చాటుకున్న ఎన్ఆర్ఐ

## - పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

ముథోల్:16జూన్:విజన్ ఆంధ్ర : ముధోల్ మండల కేంద్రానికి చెందిన విలేఖరి ఆకుల తిరుపతి గౌడ్ – సరస్వతీ గార్ల కుమార్తె ఆకుల నవ్యశ్రీ గౌడ్ గారు (ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు) ముథోల్ మండల కేంద్రము లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 3.వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులు ఠాకూర్ నవ్యశ్రీ, వరుణ్ తేజ్ గౌడ్ విద్యసంవత్సర వార్షిక ఫీజు రూ.32400/ – రూపాయలు పాఠశాల కమిటీ సభ్యులకు మంగళవారం అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆకుల నవ్యశ్రీ గౌడ్ చరవాణిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యా దానమే మహాదానం గా భావించి ప్రతి సంవత్సరం పేద విద్యార్థులను గుర్తించి వారి యొక్క పూర్తి ఫీజు చెల్లించడం జరుగుతుందన్నారు.తాను కూడా పేదరికం నుండే వచ్చి కష్టపడి చదివి ఈ రోజు అమెరికాలో ఉన్నతోద్యోగంలో కొనసాగుతున్నాన్నారు .ఈ సంవత్సరం మా అమ్మమ్మ ముష్కం వినోద, తాతయ్య ఆకుల సత్యనారాయణ గౌడ్ గార్ల జ్ఞాపకార్థం ఇద్దరు పేద విద్యార్థులను ఎంపిక చేసి వారికి తనవంతుగా ఆర్థిక సహకారం అందించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ ఆర్ ఐ ఆకుల నవ్యశ్రీ గౌడ్ కు, అందుకు ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను పాఠశాల కమిటీ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు, పాఠశాల కమిటీ సభ్యులు పతంగి కిషన్, నరేష్ దర్బార్, దత్తు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లాపురం గ్రామస్థుల కష్టాలను తీరుస్తా: ఎమ్మెల్యే పాయం ...

### - ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం...



పినపాక, జూన్16(విజన్ఆంధ్ర ): మండలంలోని పోట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లా పురం గ్రామస్థులు తమ సమస్యలు పై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను కలిశారు. గత కొన్నేళ్లుగా ప్రమాదకరంగా మారిన పెద్ద వాగు పక్కన ఉంటూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, ఏ క్షణంలో ఏ ప్రమాదం వస్తుందో తెలియక ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని మొర పెట్టుకున్నారు. వారి సమస్యలు, పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని ఎల్లాపురం గ్రామస్థులను అక్కడి నుంచి ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతంలో ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయించి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం తో గ్రామస్థులు ఆనందం, హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు గొగ్గల రామకృష్ణ, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కొమరం శ్రీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# చర్ల మండల ప్రతిభావంతురాలు మాధురికి ఘన సన్మానం

### గురుదేవ్ విద్యాలయం విద్యార్థినికి రూ. 10 వేల నగదు బహుమతి అందజేత



చర్ల, జూన్ 16 (విజన్ ఆంధ్ర) : మండలంలోని గురుదేవ్ విద్యాలయానికి చెందిన విద్యార్థిని బీవీ మాధురి, ఇటీవల వెలువడిన ఏపీఆర్జేసీ సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు సాధించి మండల కీర్తిని చాటింది. ఈ అద్భుత ప్రతిభను గుర్తించిన 'మీకోసం మేమున్నాం' టీం ఆమెను అభినందిస్తూ ఘనంగా సన్మానించింది. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కనపర్తి ఈదయ్య మరియు ఎంపీ ఓ మూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు, వారి చేతుల మీదుగా మాధురిని శాలువాలతో సత్కరించి, రూ. 10,000 నగదు బహుమతిని అందజేశారు. ఈ నగదును చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ , చింతలపాటి అశోక్ ,మరియు బీవీ ప్రతాప్ లు సంయుక్తంగా సమకూర్చారు, ?ఎంపీడీవో ఈదయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ మాధురి సాధించిన విజయం ఎందరో విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు, విద్యార్థిని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితికి చేరుకుని, ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టాలని, తద్వారా చర్ల మండల పేరును దేశస్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షించారు, పాఠశాల స్థాయి నుంచి విద్య పంతులుగా తయారయ్యే అవకాశం ఉందని ఈ సందర్భంగా గురుదేవ్ విద్యాలయం యాజమాన్యాన్ని అభినందించారు. ?ఈ కార్యక్రమానికి చర్ల మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు హాజరై విద్యార్థినిని ఆశీర్వదించడం విశేషం,ఈ కార్యక్రమంలో గురుదేవ్ విద్యాలయం ప్రిన్సిపల్ హెచ్ వి వి గిరి ప్రసాద్, బీవీ ప్రతాప్, చింతలపాటి అశోక్, శిరిపురపు శివ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు కొండపాకలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రుద్రేశ్వర ఆలయానికి మన సిద్దిపేట జిల్లా కలెక్టర్ అయినటువంటి శ్రీమతి హైమావతి మేడం గారు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.



## మండల కేంద్రంలోని రుద్రేశ్వర ఆలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధిజూన్ 16 : ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన శివాలయం పురాతన గుడి మరమ్మత్ చేసి నిత్యం దీప దూప నైవేద్యాలతో వెలసి వెలసిన కోరిన భక్తులకు కొంగుబంగారమైనకొండపాకలో శ్రీ రుద్రేశ్వర ఆలయానికి మన సిద్దిపేట జిల్లాకలెక్టర్అయినటువంటి శ్రీమతి హైమావతి ఆలయ పూజలు అధికారులు అంచనాలతో స్వాగతం పలకడం జరిగింది ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంచాల నవీన శ్రీనివాస్ గౌడ్ అనంతుల ప్రశాంత్ . శమ్మోహన్ తదితరులు పాల్గొన్నారు



## బడిబాట కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం చేయించిన

### - సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి

మల్దకల్ జూన్ 16 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నందు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులతో గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి అక్షరాభ్యాసం చేయించి, పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది.అంతకుముందు సరస్వతి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా నూతనంగా అడ్మిషన్ అయిన విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు ఉచితంగా మెరుగైన విద్యను అందించే ఉద్దేశంతో ఉచిత పుస్తకాలు, మధ్యాహ్నం నాణ్యమైన భోజనం, స్కూల్ యూనిఫాం అందజేయడం జరుగుతుందని,గ్రామంలో ప్రతి ఒక బిడ్డ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరీష, జయలక్ష్మి, అంగనవాడీ టీచర్లు ప్రశాంతి, స్కూల్ చైర్మన్ సువర్ణ,తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

### - జిల్లా విద్యాధికారి యాదయ్య



పెబ్బేరు, జూన్16 ( విజన్ ఆంధ్ర): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వనపర్తి జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. పెబ్బేరు పట్టణంలో ప్రాథమిక పాఠశాల చెంచువాడ నందు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనపర్తి జిల్లా విద్యాధికారి యాదయ్య పాల్గొని మొదట పూజా కార్యక్రమం నిర్వహించి తదనంతరం ప్రీ ప్రైమరీ, ఒకటవ తరగతి విద్యార్థుల చేత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి వనపర్తి జిల్లా విద్యాధికారి యాదయ్య మాట్లాడుతూ జిల్లాలోని 48 ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రారంభించడం జరిగిందని, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రీ ప్రైమరీ లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అన్నారు. అనంతరం పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు విద్య కోసం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని,ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార కార్యక్రమం, ప్రీ ప్రైమరీ తరగతులు, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించడం జరుగుతుందని, వాటితో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, ఉచిత యూనిఫాం తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని కాబట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఏ ఎం ఓ మహానంది గారు, సెక్టోరియల్ ఆఫీసర్ ప్రతాపరెడ్డి గారు, చంద్రశేఖర్ గారు, జిసిడిఓ ఇందిరా గారు,పెబ్బేరు మండల విద్యాధికారి ఎస్ జయ రాములు గారు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ పార్వతి శివ సాయి గారు,పెబ్బేరు వ్యవసాయ కమిటీ చైర్మన్ ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి గారు, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి గారు, పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి గారు, 7వవార్డు కౌన్సిలరు శివ సాయి గారు,4వవార్డ్ కౌన్సిలరు జమ్ములమ్మ గారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి చిన్న రాములు గారు, ఉపాధ్యాయులు స్వాతి గారు,మాధురి గారు,సీడీపీఓ సబితా గారు,రాధ, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను పిల్లలకు అందించేలా గత వైభవాన్ని మళ్లీ పునరుద్ధరి ద్దాం..

పెబ్బేరు, జూన్ 16 ( విజన్ ఆంధ్ర ) :సర్కార్ బడి లో ఒకప్పుడు మనందరం ఆ బడిలోనే చదువుకున్నాం. ప్రభుత్వ బడిలో చదివి గొప్ప గొప్ప వ్యక్తులుగా పైకొచ్చిన వారిని చూస్తున్నాం. ఇప్పటికీ ప్రభుత్వ రంగంలో పని చేయుచున్న వారందరూ ఇంచుమించు ప్రభుత్వ బడిలోనే చదువుకున్నవారే. ప్రభుత్వ బడిలో నాడు నేడు నేర్చుకోవడం అనేది ఒక ఆనందకరమైన,ఒత్తిడి లేని ప్రక్రియ. నేర్చుకోవడం ఎలాగో నేర్పడమే నిజమైన విద్య.అలాంటి విద్యను నేర్పే వృత్తి నైపుణ్యం గల ఉపాధ్యాయులు నేడు ప్రభుత్వ బడిలో పని చేయుచున్నారు. ప్రభుత్వ బడిలో పిల్లవానికి సముచితమైన స్వేచ్ఛనిస్తూ, ఆటపాటలతో విద్య విషయక, భాష, సృజనాత్మకతతో పాటు, వృత్తిపరమైన నైపుణ్యాలు, నైతిక విలువలు కలిగిన విద్యా ప్రమాణాలు... నేడు ప్రభుత్వ పాఠశాలలో అందుతుందన్న విషయాన్ని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి.

ఎక్కడ రిసోర్స్ ఉన్న ఉపాధ్యాయులు ఉంటారో అక్కడే నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందన్న సత్యాన్ని కూడా తల్లిదండ్రులు గమనించాలి. ఎందుకంటే ప్రభుత్వ పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులు పోటీ పరీక్షలను ఎదుర్కొని, కాలానికి అనుగుణంగా బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ప్రభుత్వపరంగా ఎన్నో వృత్త్యాంతర శిక్షణాలను తీసుకొని పిల్లల మనస్సు, స్థాయిని అర్థం చేసుకొని, బోధన చేసే నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయులు నేడు ప్రభుత్వ బడిలో పని చేయుచున్నారు.

దేశ భవిష్యత్తు విశ్వవిద్యాలయాల్లో కాదు.. ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుంది అనే ఏపీజే అబ్దుల్ కలాం గారి మాటలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న ప్రతి పేద విద్యార్థులందరికీ ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించాలి అనే లక్ష్యానికి మొదటి అడుగుగా మన ప్రాథమిక విద్య అడుగులు వేయుచున్నది. ఇందుకనుగుణంగా ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా గత సంవత్సరం నుండి మండలానికి రెండు పాఠశాలలో-ూఅూ-ూ× ఆధారిత అభ్యాసం (కంప్యూటర్) ద్వారా ఏ విద్యార్థి చదువులో వెనుకబడ్డారో గుర్తించి వేగవంతమైన అభ్యాసం కొరకు-ూ× కార్యకలాపాల ఆధారిత పాఠ్య క్రమం అమలు చేయుచున్నది. ఉపాధ్యాయులకు తగు శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తుంది. మరియు గత సంవత్సరం నుండి ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించడం, వారికి బోధించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించడం, పిల్లలకు ఆటపాటల ద్వారా ఒత్తిడి లేని వాతావరణంలో పిల్లలకు విద్యా నైపుణ్యాలు నేర్పించుటకు ఉపాధ్యాయులను సంసిద్ధం చేయుచున్నది.

చదువుల్ని తగ్గించడం కాకుండా నైతిక విలువలతో విద్యకు పునాది వేసే విధంగా... చదువు అంటే అర్థం చేసుకోవడం, అన్వయించడం, ఆలోచించడం వంటి నైపుణ్యాలు నేర్పడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో విద్యావిషయక, వృత్తిపర నైతిక విషయాలతో సంపూర్ణ అభివృద్ధి కోసం నిరంతర సమగ్ర మూల్యాంకన విధానాన్ని ప్రభుత్వ బడుల్లో అమలు జరుగుతుందన్న విషయాన్ని మేధావులు, విద్యాభిమానులు, తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి.

మీరు అనుకున్నట్లు ఇప్పుడున్న పాఠశాలలు ఒకప్పటి మౌలిక వసతులు లేని పాఠశాలలు కాదు. ప్రతి పాఠశాలలో డ్యూయల్ డేస్క్, ఫ్యాన్స్, విద్యుత్ సౌకర్యం, ప్రతి హై స్కూల్లో మూడు ×ఖీూ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్) ద్వారా డిజిటల్ బోధన ,జు-జుశీత్వత్ లభ్యత, ఖాన్ అకాడమీ ద్వారా (బెస్ట్ ఆన్లైన్ ఫ్లాట్ ఫామ్) ప్రాక్టీస్ అసెస్మెంట్ ఇచ్చి విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరుచుకోవచ్చును. అంతే కాకుండా కంప్యూటర్స్, సైన్స్ ల్యాబ్, గేమ్స్ మెటీరియల్స్, పిల్లలు ఆడుకోవడానికి విశాలమైన క్రీడామైదానాలు మన ప్రభుత్వ పాఠశాలలో చూడవచ్చును. నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, రాగి మాల్ట్, ఉచిత నో ట్ బుక్స్ , నోట్ బుక్స్, రెండు జతల యూనిఫార్మ్, ఈ సంవత్సరం నుండి ఉదయం అల్పాహారం ఇచ్చుటకు ప్రణాళికలు సిద్ధం చేయుచున్నది. నిజంగా ఇది అమలు అయితే పనికి పోయే తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే అన్ని పాఠశాలలను సెమి రెసిడెన్షియల్ మోడ్ గా మార్చినట్లు అవుతుంది. కేవలం తల్లిదండ్రులు రాత్రి భోజనం చూసుకుంటే సరిపోతుంది. నిజంగా పిల్లలు ఇంటి దగ్గర ఉండి ప్రైమరీ మరియు సెకండరీ విద్యను అభ్యసిస్తే.. తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పొంది, సమాజ నైతిక విలువలు నేర్చుకొని వృద్ధాప్యంలో వారి తల్లిదండ్రులను ఎలా చూసుకోవాలనే విలువలు అలవర్చుకుంటారు.

విద్యా శాఖలో అమలవుతున్న కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకెళ్ళటకు గాను మొన్న ఈ నెల 13వ తారీఖున జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్పంచులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ శిక్షణలో మీరంతా ఎక్కడ చదువుకున్నారు అని ప్రశ్నిస్తే సర్పంచ్ లు అంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నామని ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. కావున ప్రభుత్వ విద్య నాణ్యతను పెంపొందించుటకు మన పెబ్బేరు మండలంలో ఒక ప్రధానోపాధ్యాయుడు తన పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివిస్తున్నాడు. ఇది ప్రజల విశ్వాసం పొందడానికి దోహదం చేస్తుంది. ఇది మంచి పరిణామం. కావున గ్రామ,మండల స్థాయిలో చదువుకున్న తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉచిత విద్యకు చేయూతనిచ్చే విద్యాభిమానులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వ బడులను బలోపేతం చేయవలసిన అవసరం ఎంతో ఉంది. గ్రామంలో సర్పంచ్ గారు ూూజ చైర్ పర్సన్ గారు పాఠశాలను సందర్శించినప్పుడు పిల్లల చదువు యొక్క నాణ్యతను పరిశీలించి మీ అభిప్రాయాలను హెచ్ఎం/ ఎంఈఓ గారికి తెలియజేసి, మీ అభిప్రాయాలను లేదా సూచనలు ఉపాధ్యాయులకు తెలియజేసి మెరుగైన బోధన జరిగేలా మరియు నాణ్యమైన విద్యను పిల్లలకు అందేలా చేసి ప్రభుత్వ బడుల గత వైభవాన్ని మళ్లీ పునరుద్దరిద్దాం.

ప్రభుత్వ బడులపై నమ్మకం ఉంచండి!!.

ప్రవేట్ బడులలో మీరు పెట్టే ఖర్చు పిల్లల ఇతర అవసరాలకు మీ కుటుంబ అవసరాలకు వినియోగించండి.

మీ పిల్లల భవిష్యత్తు కోసం మీకెందుకంత చింత!

మన ఊర్లో ఉచిత నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ బడులుండగా మీ చెంత!!

ప్రభుత్వం ఈ మధ్యకాలంలో పాఠశాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు మరియు అదే సమయంలో రాష్ట్ర అధికారులు, మన జిల్లా కలెక్టర్ గారు మరియు జిల్లా విద్యాధికారి పర్యవేక్షణలో వనపర్తి జిల్లాలోని అందరూ మండల విద్యాధికారులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు అందరూ నాణ్యమైన విద్య అందించుటకు తమ వంతు కృషి చేయుటకు ముందుకు రావడం అందులో భాగంగా మన జిల్లా ఈ సంవత్సరం ూూజ ఫలితాలలో ఆశించిన ఫలితాలు రావడం,మన పెబ్బేరు మండలం నుండి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థి జిల్లా ూూజ ఫస్ట్ ర్యాంకుతో ఉండడం మనందరికీ సంతోషం. ఇదే ఒరవడిని కొనసాగిద్దాం. ప్రభుత్వ బడులపై నమ్మకం పెరిగేలా మనందరం కృషి చేద్దాం.

# ఎబిడి లిక్కర్ ఫ్యాక్టరీ పై చర్యలు తీసుకోవాలి

## - కలెక్టరుకు బిజెపి నాయకులు ఫిర్యాదు

పెబ్బేరు జూన్ 16( విజన్ ఆంధ్ర ): వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపూర్ ఏబీడి లిక్కర్ ఫ్యాక్టరీ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు మంగళవారం బిజెపి నాయకులు ఫిర్యాదు చేశారు.

రంగాపూర్ ఏబీడి లిక్కర్ ఫ్యాక్టరీ, షేర్ పల్లి బ్రిడ్జిని పూర్తి చేయాలని మరియు చెలిమిళ్ళ , పెబ్బేరు లోఅసంపూర్తిగా ఉన్న యుపిఎస్ స్కూల్ భవనలను పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ని కలిసి పలు ప్రజా సమస్యలపై కలెక్టర్ గారికి విజ్ఞప్తి చేయడం జరిగింది. ఏ బి డి లిక్కర్ ఫ్యాక్టరీలో కార్మికుల భద్రత మరియు శ్రమకు తగ్గ కార్మికుల వేతనాలు అందజేయాలని, పర్యావరణం జాగ్రత్తలు తీసుకోని కారణంగా లిక్కర్ ఫ్యాక్టరీ పరిసరాలలో లిక్కర్ ఫ్యాక్టరీ ద్వారా వచ్చే వ్యర్థాలతో దుర్వాసన అదేవిధంగా పంటలు దెబ్బ తినే పరిస్థితి ఉంది. అవసరానికి మించి కృష్ణ నీటిని హై స్పీడ్ మోటార్లతో నీటిని దుర్వినియోగం చేస్తున్నందున లిక్కర్ ఫ్యాక్టరీ పై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, బిజెపి పెబ్బేర్ పట్టణ అధ్యక్షుడు కావలి క్రాంతి నాయుడు, బిజెపి రూరల్ మండల అధ్యక్షుడు నాగరాజా యాదవ్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు, బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ



యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సర్వేశ్వర్ గౌడ్ పాల్గొని కలెక్టర్ గారికి విజ్ఞాపన పత్రాన్ని అందజేయడం జరిగింది. అదేవిధంగా లిషేర్ పల్లి దగ్గర ఉన్న బ్రిడ్జిని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వర్షం వస్తే కొల్లాపూర్ పెబ్బేర్ ప్రధాన రహదారి లో వాహనాలు వెళ్లే పరిస్థితి లేనందున ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. కావున తక్షణమే షేర్పల్లి బ్రిడ్జిని పూర్తి చేయాలని అదేవిధంగా చెలిమిళ్ళ యుపిఎస్ స్కూల్ అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ గారికి కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది కలెక్టర్ గారు సానుకూలంగా స్పందిస్తూ పై అంశాలపై తగు విచారణ చేస్తానని అసంపూర్తిగా ఉన్నటువంటి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయిస్తానని కలెక్టర్ గారు హామీ ఇచ్చారు. అదేవిధంగా యుపిఎస్ చెలిమిళ్ళ స్కూల్ పూర్తిస్థాయిలో నిర్మిస్తామని వారన్నారు.



## ఎల్ఓసి పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే విజయుడు

అయిజ జూన్ 16 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్ గ్రామానికి చెందిన కురువ తిమ్మప్ప అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో, వారికి మెరుగైన చికిత్స కోసం మంజూరైన 4,00,000 రూపాయలు ఎల్ఓసి పత్రాన్ని అలంపూర్ శాసనసభ్యులు విజయుడు చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్యుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

### రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు సిబ్బందికి షోకాజ్ నోటీసులు

రాజోలి జూన్ 16 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రాజోలి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మాత్తుగా సందర్శించి తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆయన, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా రంజిత్ కుమార్, కిష్టమ్మ అనే ఇద్దరు ఉద్యోగులు చాలా రోజులుగా విధులకు హాజరు కాకుండా, రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సదరు సిబ్బందికి తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో వివిధ రిజిస్టర్లను సక్రమంగా అప్‌డేట్ చేయకపోవడంపై అక్కడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో మారాలి.. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయాలను, ఉచిత మందులను సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకునేలా సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. రాబోయే నెల రోజుల్లోగా సిబ్బంది అంతా తమ పనితీరును మెరుగుపరుచుకోకుంటే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# అక్షరమే అభివృద్ధికి తొలి అడుగు

గుమ్మడిదల జూన్ 16 విజన్ ఆంధ్ర ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం మంబాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్యాభ్యాసానికి శుభారంభంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అక్షరాల ప్రాముఖ్యతను వివరించి, వారి చేత తొలి అక్షరాలను దిద్దించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారి జీవితంలో అక్షరాభ్యాసం ఒక కీలక మైలురాయి అని, విద్య ద్వారానే మంచి భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు అందించారు. పాఠశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడగా, విద్యార్థులు ఉత్సాహంగా అక్షరాభ్యాసంలో పాల్గొని తమ విద్యా ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, ప్రీ ప్రైమరి పాఠశాల ఉపాధ్యాయిని గంగోజిపేట రూప, శ్రీనివాస్ శర్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఇస్తారి గంగ, వార్డు సభ్యులు ఇస్తారి బాస్కర్, కొండని నీలవతి, సంపంగి మౌనిక, మరియు అశోక్ చారి కంజర్ల వేంకటస్వామి, మీసాలబాబు, తదితరులు పాల్గొన్నారు

# వనపర్తి జిల్లా పోలీసు పనితీరుపై సమగ్ర సమీక్ష

## - మల్టీ జోన్-2 హైదరాబాద్ ఐజీపీ షానవాజ్ ఖాసీం

వనపర్తి జూన్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో ):ప్రజలకు న్యాయం అందించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి పోలీసులు అండగా ఉన్నారనే నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని మల్టీ జోన్-2 హైదరాబాద్ ఐజీపీ షానవాజ్ ఖాసీం పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని, సత్వర పరిష్కార చర్యలు చేపడుతూ మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించడం ద్వారా పోలీసు-ప్రజా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన తెలిపారు. మంగళవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఐజీపీ షానవాజ్ ఖాసీం జోగులాంబ జోన్-7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ తో కలిసి సందర్శించి జిల్లా పోలీసు పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి, ఐజీపీ, డీఐజీ కి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు.ఐజీపీ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

జిల్లాలో నమోదైన యూఐ, గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, కాంటెస్టెడ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సమీక్ష సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ పోక్సో మరియు ఎస్సీ/




ఎస్టీ కేసుల్లో 60 రోజులలోపు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జీషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతి కేసుకు స్పష్టమైన "ప్లాన్ ఆఫ్ యాక్షన్" ఉండాలని, రౌడీ షీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.

విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించాలని, రాత్రి గస్తీని మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. లాడ్జీలు, పాత నేరస్తులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

గ్రామాల సందర్శనలకు ప్రాధాన్యత పోలీసు అధికారులు, వీఆర్వోలు, బీట్ అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సీసీటీఎన్ఎస్ డేటా ఎంట్రీపై ప్రత్యేక దృష్టి పోలీస్ స్టేషన్ రికార్డులను నిరంతరం నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్‌లో సకాలంలో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రికార్డుల నిర్వహణలో 5ఎ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాల నివారణకు చర్యలు సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, రాత్రి గస్తీల ద్వారా ఆర్థిక నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసుల పనితీరుపై ప్రశంసలు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్ గారు చేపడుతున్న చర్యలపై ఐజీపీ గారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వనపర్తి జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు వనపర్తి డీఎస్పీ, శ్రీ గిరిబాబు గారు ఐజిపి గారికి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు, అనంతరం ఐజిపి గారు డీఎస్పీ కార్యాలయంలో మొక్కలు నాటారు. గతంలో వనపర్తి ఏఎస్పీగా పనిచేసిన రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, ఐపీఎస్, ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ, గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ,సునంద, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, సుగంధ రత్నం, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, సీసీఎస్ సీఐ, అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, జిల్లా పోలీసు కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మనాయుడికి మూడు రోజుల పోలీసు కస్టడీ రంగారెడ్డి జిల్లా కోర్టు అనుమతి

గండిపేట జూన్ 16 (విజన్ ఆంధ్ర): హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూములు కాజేసే కుట్ర కేసులో అరెస్టయిన వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి మూడు రోజుల పోలీసు కస్టడీకి రంగారెడ్డి జిల్లా కోర్టు అనుమతించింది. గండిపేట సమీపంలో ప్రభుత్వ భూమిని కాజేసేందుకు నిందితులు నకిలీ జీవోలు (+రాం) సృష్టించారు. వీటి ఆధారంగా ఈ కేసులో అరెస్టయిన మరికొందరు నిందితులతో బ్రహ్మనాయుడు ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్లు వెల్లడైంది. స్థానిక తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. ఈ ల్యాండ్ స్కామ్‌లో బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర ఉన్నట్లు పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఉన్న మరిన్ని మురా వివరాలను, తెరవెనుక జరిగిన భారీ ఆర్థిక లావాదేవీల గుట్టును రాబట్టేందుకు ఆయన్ను తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, కోర్టు అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేపటి నుంచి మూడు రోజులపాటు బొల్లా బ్రహ్మనాయుడిని కస్టడీకి తీసుకుని పోలీసులు ముమ్మరంగా విచారించనున్నారు.

## తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బంధు యాకయ్య ఎన్నిక..



మరిపెడ, విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన బంధు యాకయ్య తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు లావుడియా రాములు నాయక్ ప్రకటించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల బలోపేతానికి కృషి చేసే లక్ష్యంతో బంధు యాకయ్యను రాష్ట్ర కమిటీలోకి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయన పదవీకాలం ఐదేళ్లపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బంధు యాకయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన సంఘం రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేస్తానని అన్నారు.

బంధు యాకయ్య రాష్ట్ర స్థాయి పదవికి ఎన్నిక కావడం పట్ల రాంపురం గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# మామిడిగుండాల సీలింగు భూములను భూస్వాములు ఆక్రమించడాన్ని నిలుపుదల చేయాలి..

**- పట్టాలిచ్చిన సీలింగ్ భూములకు హద్దులు చూపించాలి..**

**- భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో ఇల్లందులో ప్రదర్శన..**

**- తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా..**

ఇల్లందు, జూన్ 16 (విజన్ ఆంధ్ర)మామిడిగుండాల ప్రాంతంలో సీలింగ్ భూములను భూస్వాముల ఆక్రమణను నిలుపుదల చేయాలని, పట్టాలిచ్చిన సీలింగ్ భూములకు హద్దులు చూపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇల్లెందులో మామిడి గుండాల భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇల్లెందు కొత్తబస్టాండ్ నుంచి వందలాది మంది ఆదివాసి,గిరిజనులు ప్రదర్శనగా బయలుదేరి గోవింద్ సెంటర్ మీదుగా తాసిల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు.ధర్నానుద్దేశించి సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు,భూపోరాట కమిటీ కన్వీనర్ ఎట్టి వీరభద్రం మాట్లాడుతూ.. ఇల్లందు మండలం మామిడి గుండాల ప్రాంతంలో దొరల ఆధీనంలో ఉన్నటువంటి 4850 ఎకరాల భూమిలో 2,800 ఎకరాల భూమిని సీలింగ్ కింద తీశారని అన్నారు.ప్రతి ఆదివాసి గిరిజన కుటుంబానికి 5 ఎకరాల చొప్పున 40 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పట్టాలిచ్చిందని అన్నారు.అడవిగా ఉన్న భూమిని మామిడి గుండాల,రాజ్యాతండా,చావల వారిగుంపు,బోటి గుంపు,మేడికుంట సువర్ణపురం,ధనియాలపాడు,బాలాజీ తండా,సేవ్యా తండా గ్రామాల ప్రజలు నరుక్కొని సేద్యం చేసుకుని జీవిస్తున్నారని అన్నారు. ఈ భూములను వారం రోజుల నుండి నెమరగొమ్ముల శ్రీనుబాబు, ఉమామహేశ్వరరావు,శ్యాంసుందర్ రావు అనే భూస్వాములు భూములలో ట్రంచులు కొట్టి చట్టవిరుద్ధంగా భూములను ఆక్రమిస్తున్నారని విమర్శించారు. అధికారులు జోక్యం చేసుకొని అక్రమ పద్ధతిలో చట్టవిరుద్ధంగా ఆదివాసీల భూముల ఆక్రమణకు పూనుకున్న భూస్వాములపై కేసులు నమోదు చేయాలని,సీలింగ్ భూములకు హద్దులు చూపించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.లేని ఎడల జరగబోయే పరిణామాలకు ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం తాసిల్దార్ కాసిం కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మామిడిగుండాల సర్పంచ్ ఎట్టి రమణ,మాజీ సర్పంచ్ కుంజ కృష్ణ,భూపోరాట కమిటీ,అఖిలపక్షాల నాయకులు ముక్తి సీతారాములు,ఈసం భద్రయ్య,జబ్బా అంజయ్య,బానోత్ వెంకన్న,ఆంగోత్ ఆంజనేయులు,సూనావత్ రాందాస్,చింత భాస్కర్,మోకాళ్ళ పొట్టయ్య,సూర్ణపాక రాంబాబు,ఈసం బొజ్జయ్య,తోలేం నరేష్,సూర్ణపాక ప్రభాకర్,సూర్ణపాక మోహన్ రావు,సూర్ణపాక జంపయ్య,దారావత్ రవి, గుగులోత్ బాలు, గుగులోత్ ధర్మ,కొనుసోత్ లాలుప్రసాద్,మమత, యదల్లపల్లి సత్యం, పొడుగు నరసింహారావు, సూర్ణపాక నాగేశ్వరరావు,కొక్కు సారంగపాణి,నరాటి వెంకటేశ్వర్లు,తోడేటి నాగేశ్వరరావు,ఎట్టి నరసింహారావు,ఎట్టి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు,రైతులు ఇబ్బందులు లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించాలి.

**-తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.**



తాండూరు, జూన్ 16 (విజన్ ఆంధ్ర): నియోజకవర్గంలో ప్రజలకు రైతులకు ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సోమవారం కురిసిన వర్షాల కారణంగా ఏర్పడిన విద్యుత్ సమస్యలను సమీక్షించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి, ప్రజలకు మరియు రైతులు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు

# చిన్న మొత్తాలతో గాలం పెద్ద మొత్తాలకు టోకరా..! - రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్ళు,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 16 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): రోజుకు వేల రూపాయల ఆదాయం, కొద్దిరోజుల్లో డబ్బు రెట్టింపు, టాస్క్ పూర్తి చేస్తే భారీ కమిషన్ ట్రేడింగ్ ద్వారా ఖచ్చితమైన లాభాలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్లతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. ముఖ్యంగా టెలిగ్రామ్ గ్రూపులు, నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫార్ములు, ఫేక్ వెబ్‌సైట్ల ద్వారా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు.

మోసం ఎలా జరుగుతోంది?

సైబర్ నేరగాళ్లు ముందుగా సోషల్ మీడియా లేదా టెలిగ్రామ్ ద్వారా బాధితులను సంప్రదించి ప్రత్యేక గ్రూపుల్లో చేర్చుకుంటారు. ఆ గ్రూపుల్లో అంతర్జాతీయ కంపెనీలు, ప్రముఖ హోటళ్లు, రిసార్టులు లేదా పెద్ద బ్రాండ్ల ప్రతినిధులమని చెప్పుకుంటూ నమ్మకం కల్పిస్తారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో మొదట చిన్న చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టించి, కొంత లాభం వచ్చినట్లు ఆశ చూపించి, తర్వాత పెద్ద మొత్తంలో డబ్బును పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెడుతున్నారు.

ఈ మోసాల్లో భాగంగా ప్రొడక్ట్ ప్రమోషన్, ఆన్‌లైన్ టాస్కులు, 'ఆర్డర్ బుకింగ్', 'ట్రేడింగ్ కార్యకలాపాలు' వంటి పనులు చేస్తే అధిక కమిషన్ లేదా లాభాలు వస్తాయని నమ్మిస్తారు.

ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ లేదా ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయించి, మొదట చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టిస్తారు. మొదట కొన్ని వందలు లేదా వేల రూపాయలు చెల్లించి నిజంగా లాభాలు వస్తున్నాయనే నమ్మకం కల్పిస్తారు. ఆ తర్వాత మరింత అధిక లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహిస్తారు.

బాధితుడు పెట్టుబడులు పెంచిన కొద్దీ నకిలీ వెబ్‌సైట్‌లో భారీ లాభాలు వచ్చినట్లు చూపిస్తారు. కానీ డబ్బు విత్‌డ్రా చేసుకునే సమయంలో కొత్త కొత్త నిబంధనలు తెరపైకి తీసుకొస్తారు.

ఖాతాలో లాభాలు కనిపిస్తాయి కానీ డబ్బులు రావు.

నకిలీ ట్రేడింగ్ లేదా పార్ట్‌టైమ్ జాబ్ వెబ్‌సైట్లలో భారీ లాభాలు వచ్చినట్లు చూపిస్తారు. అయితే డబ్బు విత్‌డ్రా చేసుకునే సమయంలో కొత్త కొత్త కారణాలు చెబుతారు.

డబ్బు ఉపసంహరించుకోవాలంటే "అకౌంట్ వెరిఫికేషన్ ఫీజు", "ట్యాక్స్ క్లియరెన్స్", "సెక్యూరిటీ డిపాజిట్", "వీఐపీ అప్‌గ్రేడ్", "విత్‌డ్రా అన్‌లాక్ ఛార్జీలు" వంటి పేర్లతో మరిన్ని చెల్లింపులు చేయాలని డిమాండ్ చేస్తారు.

ఇప్పటికే పెద్ద మొత్తంలో డబ్బు పెట్టిన బాధితులు తమ డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో మళ్లీ మళ్లీ డబ్బులు చెల్లిస్తారు. అయినప్పటికీ డబ్బు విత్‌డ్రా చేయలేరు. చివరికి నేరగాళ్లు బాధితులను బ్లాక్ చేయడం లేదా మరిన్ని డబ్బులు అడగడం జరుగుతుంది.

జాగ్రత్తలు:

టెలిగ్రామ్ లేదా సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే అధిక లాభాల హామీలను నమ్మవద్దు.

పెట్టుబడి పెట్టమని లేదా టాస్కులు పూర్తి చేయాలంటే ముందుగా డబ్బు చెల్లించమని చెప్పే ఉద్యోగ అవకాశాలను తిరస్కరించండి. తెలియని వ్యక్తులు పంపిన ట్రేడింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లు లేదా లింకులపై నమోదు చేసుకోవద్దు.

గ్రూపుల్లో కనిపించే లాభాల స్క్రీన్‌షాట్లు, విజయ కథనాలు, ఫేక్ రివ్యూలను నమ్మవద్దు.

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే పథకాలకు దూరంగా ఉండండి. డబ్బు విత్‌డ్రా చేయడానికి అదనపు చెల్లింపులు కోరితే వెంటనే అప్రమత్తం అవ్వండి.

ఇప్పటికే పెట్టిన డబ్బు తిరిగి వస్తుందనే ఆశతో మరిన్ని డబ్బులు చెల్లించవద్దు.

1930 -- సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి లేదా , ద్వారా ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

## బోధన్‌లోని ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, హోటళ్లలో ఆహార భద్రతా అధికారుల తనిఖీలు

నిజామాబాద్ జూన్16:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లు మరియు రెస్టారెంట్లలో మంగళవారం నిజామాబాద్ జిల్లా ఆహార భద్రతాధికారి నవిత పర్యవేక్షణలో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా పలు వ్యాపార సంస్థలలో కనీస పరిశుభ్రత లోపించడంతో పాటు ఆహార భద్రతా ప్రమాణాలను పాటించకపోవడాన్ని అధికారులు గమనించారు. కొన్ని హోటళ్లలో వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలిగించే సింథటిక్ ఫుడ్ కలర్స్, మోనోసోడియం గ్లుటామేట్ (అజినోమోటో) వంటి రుచిని పెంచే రసాయనాలను విరివిగా వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం 2006తో పాటు సంబంధిత నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానాలతో పాటు కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడానికి ప్రతీ వ్యాపారి తప్పనిసరిగా ఆహార భద్రతా నిబంధనలను పాటించాలని మరియు తమ ప్రాంగణాలలో తగిన పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులు స్పష్టం చేశారు.

## పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి మున్సిపాలిటీ కట్టుబడి ఉంది: చైర్‌పర్సన్ సమత వెంకట్‌రెడ్డి

చేవెళ్ల, జూన్ 16 (విజన్ ఆంధ్ర): పారిశుద్ధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సంక్షేమానికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతవెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్ మూడవత్ కృష్ణ నాయక్‌తో కలిసి వాటర్‌మెన్‌లకు రెయిన్‌కోట్లు, సబ్బులు, హెయిర్ ఆయిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వర్షాకాలంలో విధులు నిర్వహించే సిబ్బంది ఆరోగ్యం, భద్రత దృష్ట్యా అవసరమైన వస్తువులను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీటి సరఫరా అందించడంలో వాటర్‌మెన్‌లు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సిబ్బంది సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల శ్రేయస్సు మెరుగుపడితే ప్రజలకు అందించే సేవల నాణ్యత కూడా పెరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు యూరియా యాప్ వినియోగించుకొని యూరియా తీసుకోవాలి

### - సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 16 : సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సమక్షంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి స్వరూప రాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న అనుభవజ్ఞులైన రైతులు పాల్గొని ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం తదితర ప్రకృతి సిద్ధమైన ద్రావణాల తయారీ విధానం, ఉపయోగాలను వారు వివరించారు. అంతేకాకుండా రైతులకు యూరియా బుకింగ్ యాప్‌పై అవగాహన కల్పించారు. పర్యావరణ హితమైన పద్ధతులను అవలంబిస్తున్న రైతులను అభినందించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడి, రసాయన రహిత పంటలు పండుతాయన్నారు. రైతులు యూరియా యాప్‌లో బుకింగ్ చేసుకుని మాత్రమే యూరియా తీసుకోవాలని, యాప్‌లో ఏదైనా సలహాలు, సూచనల నిమిత్తం వ్యవసాయ శాఖ నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ, వ్యవసాయాన్ని స్థిరంగా మార్చేందుకు రైతు నేస్తం ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. జ్ఞానాన్ని పంచుకునేందుకు రైతు వేదికలను వినియోగించుకోవాలని, తెగుళ్ల నివారణకు జీవామృతం, నీమాస్త్రం వంటి తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత, కుందన్‌వానిపల్లి సర్పంచ్ పొన్నాల వెంకమ్మ, ఎఫ్‌పీఓ చైర్మన్ స్వామి రెడ్డి, ఫెర్టిలైజర్ డీలర్లు మరియు రైతులు శంకర్, కర్ణాకర్, సమ్మయ్య పాల్గొన్నారు. ఎరువులు మరియు పురుగు మందుల డీలర్ షాపు లను తనిఖీ చేశారు. డీలర్స్ కి కూడా షాప్ చట్టం ప్రకారం నడిపించాలి, ఎంఆర్పి రేట్లుకి మాత్రమే అమ్మాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ప్రభుత్వానికి రూ.4.29 కోట్ల టోకరా.. రైస్ మిల్లు యజమాని అరెస్ట్

కాటారం డివిజన్ ప్రతినిధి, జూన్ 16 (విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వానికి అప్పగించాల్సిన సుమారు రూ.4.29 కోట్ల విలువైన బియ్యాన్ని అందించకుండా అక్రమాలకు పాల్పడిన కేసులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన 3 ఆర్ఎస్ రుద్ర రైస్ మిల్లు యజమాని చీర్ల రవికాంత్‌ను కాటారం పోలీసులు అరెస్ట్ చేశారు. 2022-23 రబీ, ఖరీఫ్ సీజన్లలో సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ మిల్లుకు సుమారు 38 వేల క్వింటాళ్ల వడ్లను బియ్యం పట్టేందుకు అప్పగించగా, మిల్లు యాజమాన్యం ప్రభుత్వానికి బియ్యాన్ని తిరిగి అందించలేదు. దీంతో డిప్యూటీ మేనేజర్ సీతగారి రాఘవేందర్ ఫిర్యాదు మేరకు 2024లో కేసు నమోదైంది. కాటారం సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో పోలీసులు జూన్ 15న చింతకాని క్రాస్ వద్ద రవికాంత్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో ఎవరెవరి ప్రమేయం ఉన్నా వదిలిపెట్టబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఈవూరి నాగార్జున రావు హెచ్చరించారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు అవినీతి చేశారని ఆరోపించడం కాదు

# - నీకు దమ్ము ధైర్యం ఉంటే ఆధారాలతో నిరూపించు

### - జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నగేష్ రెడ్డి

ఈరోజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నగేష్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నిన్నటి రోజు ఎంపీ అరవింద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి,మంత్రులు అవినీతి చేశారని ఆరోపిస్తున్నారని నీకు దమ్ము ధైర్యం ఉంటే అవినీతి చేశారని ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. ఒకపక్క కేంద్రంలో నీట్ పరీక్ష పేపర్ లీక్ తో యువకులు రోడ్లపైకి వచ్చి ఢిల్లీలో ధర్నాలు చేస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రిని రాజీనామా చేయమని డిమాండ్ చేస్తుంటే ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టడం మానుకోవాలని అన్నారు.

యూరియా యాప్ అనేది కేవలం తెలంగాణలో మాత్రమే లేదు అని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా అన్ని రాష్ట్రాలలో యూరియా యాప్ ఉంది అని,దేశంలో నాలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే మిగతా రాష్ట్రాలలో బీజేపీ ఉంది కదా మరి దానిగురించి ఎందుకు మాట్లాడటం లేదు ,కేంద్రం ఏ విధంగా రాష్ట్రానికి యూరియా సరఫరా చేస్తే ఆ విధంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తుంది అని కేంద్ర ప్రభుత్వం ఒకేసారి యూరియాను రాష్ట్రానికి అందిస్తే జిల్లాలో యూరియా అందిస్తామని, యూరియా యాప్ ద్వారా ఒక ఎకరానికి ఒకేసారి రెండు బస్తాలు, మూడు ఎకరాలు ఉన్నవారికి రెండుసార్లు, ఐదు ఎకరాలు ఉన్నవారికి మూడుసార్లు, ఆపై ఉన్న వారికి నాలుగు దశల వారీగా యూరియా అందించడం జరుగుతుంది అని అన్నారు. యూరియా యాప్ కేంద్ర ప్రభుత్వమే తీసుకువచ్చిందని అన్నారు. యాప్ గురించి తెలియని వారి కోసం గ్రామస్థాయిలో గ్రామపంచాయతీలలో ఏఈఓలను మండల స్థాయిలో ఏఓలను పెట్టడం జరిగిందని అన్నారు



కేంద్రంలో మన్మోహన్ సింగ్ గారు ప్రధానిగా ఉన్నప్పుడు సుమారు 18 సంవత్సరాల క్రితం 2004 నుండి 2014 వరకు క్రూడ్ ఆయిల్ బారెల్ ధర 140 డాలర్లు ఉంటే డీజిల్ 55 రూపాయలు పెట్రోల్ 65 రూపాయలు ఉండేది అని ప్రస్తుతం క్రూడ్ ఆయిల్ ధర 100 డాలర్లు ఉంటే పెట్రోల్ డీజిల్ ధరలు మాత్రం విపరీతంగా పెంచుతున్నారు అని లక్షల కోట్లు పేద ప్రజలపై భారం మోపడం జరిగిందని ప్రతి ఇంటికి బైకులు ఉన్నాయని రైతులకు ట్రాక్టర్లకు డీజిల్ ధరలు పెంచి రైతులను ముంచుతున్నారని ఎక్కడ కూడా రైతులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు అని ఆయన అన్నారు.

నరేంద్ర మోడీ 12 ఏళ్ల ప్రధానమంత్రిగా దేశానికి చేసిన అభివృద్ధి శూన్యమని, జవహర్లాల్ నెహ్రూ గారు దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ప్రధానిగా బాధ్యతలు తీసుకున్నారని ఆ సమయంలో దేశం గుండు పిన్ను కూడా తయారీ చేయలేని స్థితిలో ఉంది అని కరెంటు రోడ్లు ఉండడానికి ఇల్లు తినడానికి తిండి సరిగ్గా లేని రోజు నుండి 17 సంవత్సరాలు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని ప్రపంచ దేశాల స్థాయిలో అభివృద్ధిలో ఎదిగేలా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదు అని నల్లధనాన్ని బయటకు తీసి ప్రతి పేదవాని ఎకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తామని ఇప్పటికీ వేయలేదు అని నగేష్ రెడ్డి అన్నారు.

7 ఏండ్లు పార్లమెంట్ సభ్యుడిగా నిజామాబాద్ పార్లమెంటుకు ఒక్క రూపాయి కూడా తీసుకు రాలేదని రైల్వే బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయని పసుపు బోర్డు పేరుకే తీసుకువచ్చారు కానీ దానిలో అధికారులను నియమించలేదు అని పసుపు బోర్డు ద్వారా పసుపు కు మద్దతు ధర ఇప్పించడంలో అరవింద్ విఫలమయ్యారని నగేష్ రెడ్డి అన్నారు.

అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత అభివృద్ధి సంక్షేమం రెండు సమానంగా అందిస్తున్నామని ఆయన అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నిజామాబాద్ జిల్లాకు మూడు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను 600 కోట్ల నిధులతో మంజూరు చేయడంలో తోడ్పాటు జరిగిందని, అదేవిధంగా వ్యవసాయ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయడంలో మహేష్ కుమార్ గౌడ్ గారు ఎంతో కృషి చేయడం జరిగిందని ఆయన అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తున్నామని, 500 రూపాయలకే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేశామని,రైతులకు రైతు రుణమాఫీ చేశామని, సన్నవడ్లకు 500 బోనసిస్తున్నామని, రైతు భరోసా అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుండి 10 లక్షల పెంచడం జరిగిందని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని, రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తున్నామని నగేష్ రెడ్డి అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రులు అవినీతి చేశారని అరవింద్ ఆరోపించడం కాదు నీకు దమ్ము ధైర్యం ఉంటే ఆధారాలతో సహా వాటిని నిరూపించాలని నగేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూడా చైర్మన్ కేశ వేణు,రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్,డిసిసి కోశాధికారి భక్తవత్సలం, డిసిసి ఉపాధ్యక్షులు రత్నాకర్ గౌడ్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, డిసిసి కార్యదర్శి గణేష్, కరీంద్దీన్, మొయిన్, మహమ్మద్ వాలి మరియు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖాన సమస్యలు పరిష్కరించాలి

మందమర్రి, జూన్ 16 (విజన్ ఆంధ్ర) : క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని రవీంద్రఖని రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానలో నెలకొన్న సమస్యలను అధికారులు తక్షమే పరిష్కరించాలని చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్,ఏఈ ఆశ్రిత్ లతో కలిసి ఆమె పల్లె దవాఖానను సందర్శించారు. పరిసరాలలో పెరిగిన పిచ్చి మొక్కలు, అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. అలాగే తాగునీటి సౌకర్యాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. చైర్ పర్సన్ వెంట కౌన్సిలర్లు కౌడగొని సాంబయ్య,బొమ్మ భూమయ్య గౌడ్,కొప్పి రాజశేఖర్ ఉన్నారు.

### తాళ్ల గురజాలలో

## ‘అరైవ్-అలైవ్’ అవగాహన కార్యక్రమం

### యువత రోడ్డు భద్రత, మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి: సీపీ అంబర్ కిషోర్ ఝా

బెల్లంపల్లి రూరల్ సర్కిల్ ఆధ్వర్యంలో తాళ్ల గురజాల గ్రామంలో ‘అరైవ్–అలైవ్’ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్–సీటుబెల్ట్ వినియోగం, గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్పరిణామాలపై యువతకు అవగాహన
ఈ కార్యక్రమానికి సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఏ. భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రభుత్వ, పోలీస్ శాఖల ప్రధాన లక్ష్యమని డీసీపీ తెలిపారు.
ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సీపీ మాట్లాడుతూ, యువత లక్ష్యంతో ముందుకు సాగాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారే వాహనాలు నడపాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. మైనర్ డ్రైవింగ్‌పై తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న యువకులు పుష్–అప్స్ ప్రదర్శించగా, అధికారులు వారిని అభినందించారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన ఓ యువకుడికి సీపీ శాలువాతో సత్కరించి రూ.500 బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో,బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్, ఎస్ఐ రామక్రిష్ణ, ఏ ఎస్సై అలీ , ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు,యువత పాల్గొన్నారు



# ప్రజా పాలనలో మహిళలకు ప్రాధాన్యం

### కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ తిరుపతి రెడ్డి

కొడంగల్, జూన్ 16(విజన్ ఆంధ్ర ): ప్రజా ప్రభుత్వ పాలనలో మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు కొడంగల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ తిరుపతి రెడ్డి అన్నారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామం లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ ఆధ్వర్యంలో పాల్గొన్న కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి ప్రభుత్వ పాఠశాల అదనపు గదులు, కాపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళా అభివృద్ధి కొరకు కుట్టు మిషన్ ల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.మహిళా సంఘాలు కార్పొరేట్ కంపెనీలతో పోటీ పడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు.మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ కావడంతో అభివృద్ధి దిశలో ముందు వరుసలో కొనసాగుతుందని అన్నారు. వేల కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గం లో అన్ని రంగాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్ లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

చేవెళ్ల, జూన్ 16 (విజన్ ఆంధ్ర): పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆకాంక్షించారు. చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, ప్రజలతో మమేకమై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న శ్రీనివాస్ యాదవ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవను మరింత విస్తరించి రాజకీయ, వ్యాపార రంగాల్లో విజయాలు సాధిస్తూ ఉన్నత పదవులు చేపట్టాలని ఆశీర్వదించారు. ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్ తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కాలే యాదయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి ఆగిరెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, చినుమరి జైపాల్ రెడ్డి, పొడవు శ్రీనివాస్, రవీందర్ గౌడ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్ మెట్రో ఫేజ్--2 విస్తరణకు అవసరమైన కేంద్రం అనుమతులతో పాటు ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదల మరింత జాప్యం చేయవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఈ అంశంపై చర్చించేందుకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖ రాశారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్--1 మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు ప్రయాణికులకు విశేష సేవలు అందిస్తోంది. పెరిగిన జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్--2 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. మొత్తం 7 కారిడార్లు, 122.9 కిలోమీటర్ల మార్గం, సుమారు ?38,595 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనలు ఇచ్చింది.

ఫేజ్--1 ప్రైవేటు నిర్వహణలో ఉండటం, ఫేజ్--2 వేరే సంస్థాగత విధానంలో అమలు చేయటంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తెలిపిన అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మకంగా స్వీకరించిందని సీఎం ఈ లేఖలో వివరించారు. మొత్తం మెట్రో వ్యవస్థ ఒకే నెట్ వర్క్?లో నడిచేందుకు వీలుగా ఫేజ్--1ను స్వాధీనం చేసుకునే అసాధారణ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఫేజ్--1 స్వాధీనం ప్రక్రియలో ఈక్విటీ కొనుగోలుకు రూ. 1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ. 13,538.53 కోట్లు కలిపి మొత్తం ?15,000 కోట్ల లావాదేవీలున్నాయి. ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ పారదర్శకంగా నిర్వహించింది. ఈ కమిటీకి కేంద్ర ప్రభుత్వం తరఫున యూపీఎంఆర్‌సీఎల్ ఎండీ సుశీల్‌కుమార్‌ను సభ్యుడిగా నామినేట్ చేసిందని గుర్తుచేశారు.

ఐఆర్ఎఫ్‌సీ ప్రాజెక్టును పూర్తిగా పరిశీలించి, డ్యూ డిలిజెన్స్ పూర్తి చేసి రుణ మంజూరు ఒప్పందం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. ఆర్?బీఐ ద్వారా డైరెక్ట్ డెబిట్‌కు అంగీకరించింది. ఐఆర్ఎఫ్‌సీ షరతుల ప్రకారం మొదటి విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ?84.32 కోట్ల అప్‌ఫ్రంట్ ఫీజు చెల్లించింది. ఈక్విటీ ?1,461.47 కోట్లు ఇప్పటికే ఎస్క్రో ఖాతాలో జమ చేసింది.

ఈ ఒప్పందాలన్నీ పూర్తయ్యాక, అన్ని షరతులు నెరవేర్చాక, 2026 జూన్ 15న రావాల్సిన మొదటి విడత రుణం విడుదల కాలేదని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి దానం అడగటం లేదని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఒప్పందం ప్రకారం ఐఆర్?ఎఫ్?సీ రుణాన్ని విడుదల చేయించాలని కోరుతున్నామని లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ నుంచి కేంద్రంలో సీనియర్ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఈ విషయంలో బాధ్యత తీసుకుని ఐఆర్ఎఫ్‌సీ ద్వారా మంజూరైన రుణం విడుదలయ్యేలా చూడాలని కోరారు. మెట్రో ఫేజ్--2ను కేంద్రం--రాష్ట్రం 50:50 జాయింట్ వెంచర్‌గా ఆమోదించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందని సీఎం ఈ లేఖలో వివరించారు.

ఒకవేళ అనుమతులు ఆలస్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరులు, సంస్థాగత రుణాల ద్వారా ఫేజ్--2ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన ముందస్తు అనుమతులను ఆలస్యం లేకుండా కేంద్రం నుంచి ఇప్పించాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం కిషన్‌రెడ్డిని కోరారు. సంబంధిత ఒప్పందాలు, ఆధార పత్రాలతో తాను అధికారులతో కలిసి ఆ సమావేశానికి హాజరై అన్ని వివరణలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

## విద్యార్థుల ప్రతిభకు

# ఘన సత్కారం

### తెలంగాణ పీపుల్స్ వాయిస్ ఆధ్వర్యంలో మెరిట్ అవార్డుల ప్రదానోత్సవం

విజన్ ఆంధ్ర(16) హైదరాబాద్ : ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తెలంగాణ పీపుల్స్ వాయిస్ సంస్థ ఆధ్వర్యంలో మెరిట్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు, హైదరాబాద్‌లోని పల్లవి ఇంజనీరింగ్ కాలేజీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది విద్యార్థులు సత్కారం పొందారు, ఈ సందర్భంగా తెలంగాణ పీపుల్స్ వాయిస్ అధ్యక్షులు కాలం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు, విద్యతో పాటు విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని అన్నారు, పల్లవి ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ మల్క కోమరయ్య మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించు కోవడం నేటి యువతకు ఎంతో అవసరమని, భవిష్యత్తులో అందు బాటులోకి రానున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, ప్రసిద్ధ మోటివేషనల్ స్పీకర్ అకెళ్ల రాఘవేంద్ర విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానసిక ధైర్యం, సమయ పాలన, వ్యక్తిత్వ వికాసం విజయానికి కీలకమని వివరించారు, ఈ కార్యక్రమంలో గంధారి ప్రభాకర్, కాలం జనార్దన్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని విద్యార్థులకు అవార్డులు అందజేసి అభినందించారు, కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు

# "భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది"



"భారతదేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది"... అన్నది ఇక పై ఒక నినాదం మాత్రమే కాదు... కళ్ల ముందు కనిపించే నిజం. ఆ నిజానికి సాక్ష్యం ఆరుట్లలోని "తెలంగాణ పబ్లిక్ స్కూల్". మేధావుల సలహాలు, విజ్ఞుల సూచనలతో తెలంగాణ విద్యా వ్యవస్థ చరిత్రను విప్లవాత్మక సంస్కరణలతో తిరిగి రూపం "తెలంగాణ పబ్లిక్ స్కూల్". చరిత్ర పుటల్లో కలిసిపోతున్న సర్కారు బడి ప్రజా పాలనలో నేడు మళ్లీ పూర్వవైభవాన్ని మించిన వైభవంతో, సకల సౌకర్యాలతో, ఆధునిక వసతులతో, పిల్లల మేధో వికాస్ క్షేత్రంగా నిలవబోతోంది. తెలంగాణ బిడ్డల పాలిట సరస్వతీ కటాక్ష ఆలయంగా రూపుదిద్దుకున్నది. ఆకలి తీర్చి, అక్షరాలు నేర్పి, ఆటను ప్రోత్సహించి పిల్లల్లో మనో వికాసం వికసించేలా, మట్టిలో మాణిక్యాలను తీర్చి దిద్దే సకల హంగులతో రూపుదిద్దుకున్న నా మానస పుత్రిక ఈ పాఠశాల. "తెలంగాణ పబ్లిక్ స్కూల్"కు రూపం ఇచ్చే కార్యంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. విద్యార్థులకు అభినందనలు.

ఆరుట్లలో ఆవిష్కృతమవుతున్న నేటి ఈ "తెలంగాణ పబ్లిక్ స్కూల్" ఆరంభం మాత్రమే. తెలంగాణ వ్యాప్తంగా భవిష్యత్ లో వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నెలకొల్పడం తదుపరి మా కర్తవ్యం.

## తుమ్మెన్ పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులు పాఠ్య పుస్తకాల పంపిణీ



అచ్చంపేట జూన్ 16 (విజన్ ఆంధ్ర) : పాఠశాలలు పునర్ ప్రారంభమైన సందర్భంగా బల్మూర్ మండలంలోని తుమ్మెన్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటిరోజు స్థానిక సర్పంచ్ పుట్ట సురేష్ ప్రధాన ఉపాధ్యాయులు గజేంద్ర శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు వారికి మిఠాయిలు పంపిణీ చేసినట్లు సర్పంచ్ సురేష్ తెలిపారు అదేవిధంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోటుబుక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంయు ఓ శ్రీనివాస్ సెక్రెటరీ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ హిమా బిందు విద్యార్థులు పాల్గొన్నారు

# మామిడి కోత తర్వాత తోటల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- సమగ్ర యాజమాన్య పద్ధతులతో వచ్చే సీజన్‌లో అధిక దిగుబడులు సాధ్యం
- కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త ఉల్లంగుల స్రవంతి సూచనలు



బెల్లంపల్లి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : మామిడి కోత పూర్తయిన వెంటనే తోటల సమగ్ర యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా అమలు చేయాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాస్త్రవేత్త ఉల్లంగుల స్రవంతి రైతులకు సూచించారు. కోత అనంతర నిర్వహణను నిర్లక్ష్యం చేస్తే వచ్చే సీజన్‌లో పుష్పోత్పత్తి తగ్గడం, కాయధారణ బలహీనపడడం, దిగుబడి గణనీయంగా పడిపోవడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముందని ఆమె హెచ్చరించారు. శాస్త్రీయ పద్ధతుల్లో తోటలను నిర్వహిస్తే చెట్ల ఆరోగ్యం మెరుగుపడి, పురుగు--వ్యాధుల ప్రభావం తగ్గి, అధిక నాణ్యతతో కూడిన దిగుబడులు సాధ్యమవుతాయని వివరించారు.

**తోట పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన చెట్లు**

మామిడి కోత పూర్తయిన వెంటనే తోటల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టడం అత్యంత కీలకమని స్రవంతి తెలిపారు. చెట్ల కింద పడిపోయిన పండ్లు, ఎండిపోయిన ఆకులు, వ్యాధిగ్రస్త కొమ్మలు, ఇతర మొక్కల అవశేషాలను వెంటనే తొలగించాలని సూచించారు. కలుపు మొక్కలను పూర్తిగా నిర్మూలించి, వ్యాధి సోకిన అవశేషాలను తోటలో వదిలిపెట్టకుండా బయట గుంత తవ్వి పూడ్చివేయడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చని చెప్పారు.

**కొమ్మల కత్తిరింపుతో గాలి, వెలుతురు ప్రసరణ మెరుగుదల**

ఎండిపోయిన, విరిగిన, ఒకదానికొకటి అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించడం వల్ల చెట్లలో గాలి, వెలుతురు సరిగా ప్రసరిస్తాయని తెలిపారు. దీంతో కొత్త చిగుర్లు ఆరోగ్యంగా పెరిగి, వ్యాధుల తీవ్రత కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. పెద్ద గాయాలపై బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పూత వేయాలని, కత్తిరించిన కొమ్మలను తోటలోనే వదిలేయకుండా పూర్తిగా తొలగించాలని సూచించారు.

**ఎరువుల యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి**

పది సంవత్సరాల పైబడిన ప్రతి మామిడి చెట్టుకు 50--100 కిలోల పశువుల ఎరువు, 2.2 కిలోల యూరియా, 6 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్పీ), 1.7 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ) వేయాలని సూచించారు. ఈ ఎరువులను చెట్టు నీడ పరిధిలో వలయాకారంగా 15--20 సెంటీమీటర్ల లోతులో వేసి మట్టితో కప్పడం వల్ల మొక్కలు సమర్థంగా పోషకాలను గ్రహిస్తాయని తెలిపారు.

**సూక్ష్మపోషకాల పిచికారీతో చిగుర్లకు బలం**

కొత్త చిగుర్లు వచ్చిన 20--30 రోజుల తర్వాత సూక్ష్మపోషకాల పిచికారీ చేయడం ద్వారా మొక్కల పెరుగుదల మెరుగుపడుతుందని వివరించారు. లీటరు నీటికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 1 గ్రాము బోరాక్స్, 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి పిచికారీ చేయవచ్చని తెలిపారు.

ప్రత్యామ్నాయంగా మామిడి ప్రత్యేక మైక్రోన్యూట్రియంట్ మిశ్రమాన్ని 5 గ్రాములు లీటరు నీటికి కలిపి కూడా పిచికారీ చేయవచ్చని సూచించారు.

**నీటి యాజమాన్యం కూడా కీలకం**

వర్షాలు ప్రారంభమయ్యే వరకు 10--15 రోజుల వ్యవధిలో తోటలకు నీటిని అందించాలని స్రవంతి సూచించారు. వర్షాకాలంలో నీరు నిల్వ కాకుండా తగిన డ్రైనేజీ ఏర్పాటు చేయడం అత్యవసరమని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ ఉన్న తోటల్లో మట్టి తేమను బట్టి మాత్రమే నీటిని అందించడం వల్ల నీటి వినియోగం సమర్థవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

**వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

వర్షాకాలంలో తోటల్లో నీరు నిల్వ కాకుండా కాలువలు ఏర్పాటు చేయాలని సూచించారు. మల్చింగ్ ద్వారా నేల తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచడంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను కూడా నియంత్రించవచ్చని తెలిపారు. గాలివానల వల్ల విరిగిన కొమ్మలను వెంటనే తొలగించి, గాయాలకు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**అంతర పంటలతో అదనపు ఆదాయం**

చిన్న వయస్సు మామిడి తోటల్లో పప్పుధాన్యాల సాగు రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తుందని స్రవంతి తెలిపారు. పెసర, మినుము, కంది, అలసంద వంటి పంటలను సాగు చేయడం ద్వారా నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి భూసారం పెరుగుతుందని చెప్పారు.

**పురుగు--వ్యాధుల సమగ్ర నియంత్రణ అవసరం**

మామిడి తోటల్లో హాపర్, మీలీ బగ్, కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు, పండు ఈగ, త్రిప్స్ వంటి పురుగులతో పాటు ఆంత్రాక్నోస్, పౌడరీ మిల్డ్యూ వంటి వ్యాధులు అధిక నష్టం కలిగిస్తాయని ఆమె తెలిపారు. తోటలను తరచూ పరిశీలిస్తూ అవసరమైన సమయంలో సమగ్ర పురుగు--వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు.

**వచ్చే సీజన్‌కు ఇప్పుడే పునాది**

మామిడి కోత అనంతరం తోటల నిర్వహణలో కత్తిరింపు, ఎరువుల వినియోగం, సూక్ష్మపోషకాల పిచికారీ, నీటి యాజమాన్యం, పరిశుభ్రత, సమగ్ర పురుగు--వ్యాధి నియంత్రణ వంటి అన్ని శాస్త్రీయ చర్యలను క్రమం తప్పకుండా అమలు చేస్తే వచ్చే సీజన్‌లో అధిక పుష్పోత్పత్తి, మెరుగైన కాయధారణ, నాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త ఉల్లంగుల స్రవంతి స్పష్టం చేశారు.

రైతులు కోత అనంతర నిర్వహణను తేలికగా తీసుకోకుండా శాస్త్రీయ సిఫారసులను పాటిస్తే మామిడి సాగు మరింత లాభదాయకంగా మారుతుందని ఆమె పేర్కొన్నారు.